తెలుగు

Follow: @ANNTELUGU

18-03-2026

# మహా పత్రిక

బుధవారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 80 పేజీలు-08 వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## పశ్చిమాసియా రణభేరి
### కేంద్రం అలర్ట్
### నేడు ప్రధాని మోదీ అధ్యక్షతన కేబినెట్ భేటీ

**ఢిల్లీ, మహా:** పెరుగుతున్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల నేపథ్యంలో దేశ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలనే సంకల్పంతో బుధవారం మధ్యాహ్నం ఢిల్లీలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన కేంద్ర కేబినెట్ అత్యవసరంగా సమావేశం కానుంది. ఈ అత్యున్నత స్థాయి భేటీలో దేశ భవిష్యత్తును, సామాన్యుడి జీవన భద్రతను ప్రభావితం చేసే అత్యంత కీలకమైన నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉన్నట్లు జాతీయ రాజకీయ, వాణిజ్య వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది. పశ్చిమాసియాలో రోజు రోజుకూ తీవ్రరూపం దాల్చుతున్న యుద్ధ పరిస్థితులు ప్రపంచ వాణిజ్య పునాదులను కదిలిస్తున్నాయి. చమురు ఉత్పత్తికి కేంద్ర బిందువైన ఆ ప్రాంతంలో శాంతి కరువవడంతో, ముడి చమురు సరఫరా శృంఖలాలపై మునుపెన్నడూ లేని స్థాయిలో అంతరాయం ఏర్పడే ప్రమాదం పొంచి ఉంది.

మిగతా 2లో

**టాప్ న్యూస్**



అడ్డంగా దొరికినా బాబు
### నో యాక్షన్
- పుట్టా మహేష్ అంశంపై వైఎస్ జగన్ ఫైర్

02



డ్రగ్స్ టెస్టుకు
### కేసీఆర్ రావాలి
- సీఎంనూ తీసుకువస్తా
- టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్ సవాల్

02



నాకు నయనతార
### కావాలి
- స్టాలిన్ నా కోరిక తీరుస్తారా?
- అన్నాడీఎంకే ఎంపీ వివాదాస్పద వ్యాఖ్యల

02

# జగ్గారెడ్డికి పీసీసీ
## మంత్రి కోమటిరెడ్డి సంచలన ప్రతిపాదన



- జగ్గన్న మాస్ లీడర్.. మరో పీజేఆర్
- ఆయనకు పీసీసీ చీఫ్ ఇస్తే కాంగ్రెస్‌కు 100 సీట్లు పక్కా
- మహేష్ గౌడ్ టర్మ్ ముగియకముందే.. నేతల వాయిస్

**హైదరాబాద్, మహా :** తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) అధ్యక్ష పదవికి సంబంధించి.. తెలంగాణ రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు రాష్ట్రంలో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. టీపీసీసీ పదవిని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డికి ఇవ్వాలంటూ మంత్రి కోమటిరెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ బడ్జెట్ సమావేశాల సందర్భంగా అసెంబ్లీ లాబీల్లో మీడియాతో చిట్ చాట్‌గా మాట్లాడిన మంత్రి కోమటిరెడ్డి.. జగ్గారెడ్డికి పీసీసీ పగ్గాలు అప్పగించాలన్నారు. జగ్గారెడ్డి ఎల్లప్పుడూ ప్రజల్లో ఉండే మాస్ లీడర్ అని ప్రశంసలు గుప్పించారు.

### మరో పీజేఆర్

ఎవరైనా ఆపదలో ఉంటే జగ్గారెడ్డి వెంటనే ఆదుకుంటారని, ఆయన మరో పీజేఆర్ అని మంత్రి కోమటిరెడ్డి పేర్కొన్నారు. టీపీసీసీ చీఫ్‌గా జగ్గారెడ్డి ఉంటే రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి 100 స్థానాలు వస్తాయని వెల్లడించారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డికి ఉన్న నాయకత్వ లక్షణాలపై ప్రశంసల జల్లు కురిపించారు. జగ్గారెడ్డి పనితీరు చాలా బాగుంటుందని కొనియాడారు. ప్రస్తుతం టీపీసీసీ చీఫ్‌గా మహేష్ కుమార్ గౌడ్ కొనసాగుతుండగానే మంత్రి కోమటిరెడ్డి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం అటు పార్టీలో, ఇటు రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారి తీసింది. గత కొన్ని రోజులుగా తెలంగాణ మంత్రి వర్గాన్ని త్వరలో విస్తరించనున్నట్లు వార్తలు వస్తున్న వేళ.. ఇప్పుడు పీసీసీ చీఫ్‌ను కూడా మార్చాలంటూ పరోక్షంగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారానికి కారణం అవుతున్నాయి. పీసీసీ చీఫ్ గా మహేష్ గౌడ్ టర్మ్ మరో ఆరుమాసాలు ఉండగానే.. మంత్రి కోమటిరెడ్డి నూతన పీసీసీ పల్లవి అందుకోవడం కాంగ్రెస్ లో హాట్ టాపిక్ గా మారింది.

**జగ్గారెడ్డి అంటే అందరికీ ఇష్టమే** | పీసీసీపై హైకమాండేదే తుది నిర్ణయం | జీవన్ రెడ్డి విషయంలో పీసీసీదే బాధ్యత | మంత్రి శ్రీధర్ బాబు చిట్ చాట్

03



## దద్దరిల్లిన అసెంబ్లీ
### కేటీఆర్ వర్సెస్ భట్టి విక్రమార్క
ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానన్న కేటీఆర్

ఎగ్గొట్టు.. కూలగొట్టు.. చెడగొట్టు.. కాంగ్రెస్ పాలనపై కేటీఆర్ విమర్శలు

**హైదరాబాద్, మహా :** తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు రాజీనామా సవాళ్లతో దద్దరిల్లాయి. మహిళా సంఘాల రుణాల విషయంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క చేసిన ప్రకటనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ సంచలన సవాల్ విసిరారు. అసెంబ్లీలో చర్చ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. రాష్ట్రంలోని మహిళా సంఘాలకు తమ ప్రభుత్వం ఇప్పటి వరకు రూ.57 వేల కోట్ల రుణాలను మంజూరు చేసిందని పేర్కొన్నారు. ఆ లెక్కలను కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. ఒకవేళ మహిళలకు రూ.57 వేల కోట్ల రుణాలు ఇచ్చినట్లు ప్రభుత్వం దగ్గర ఉన్న ఆర్డర్ కాపీని ఇప్పుడే సభలో చూపిస్తే.. తాను తన ఎమ్మెల్యే పదవికి తక్షణమే రాజీనామా చేస్తానని కేటీఆర్ సవాల్ విసిరారు. ఒకవేళ అటువంటి ఆర్డర్ కాపీ లేకపోతే.. తప్పుడు సమాచారం ఇచ్చినందుకు భట్టి విక్రమార్క తన డిప్యూటీ సీఎం పదవితో పాటు ఎమ్మెల్యే పదవికి కూడా రాజీనామా చేస్తారా.. అని కేటీఆర్ ప్రశ్నించారు. ఈ సవాల్‌తో సభలో ఒక్కసారిగా అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. గణాంకాల విషయంలో ప్రభుత్వం ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని కేటీఆర్ తనదైన స్టైల్లో ఆరోపించారు.

**ఎగ్గొట్టు.. కూలగొట్టు.. చెడగొట్టు..**

కాంగ్రెస్ పాలనను మూడు ముక్కల్లో చెప్పాలంటే 'ఎగ్గొట్టు.. కూలగొట్టు.. చెడగొట్టు' అన్న చందంగా ఉందని కేటీఆర్ విమర్శించారు.

మిగతా 2లో

### ఢిల్లీ వేదికగా కాంగ్రెస్ అగ్రనేతల మంతనాలు
ఏఐసీసీ పెద్దలతో సీఎం రేవంత్, పీసీసీ చీఫ్ కీలక భేటీ

02



## రాజ్యసభ ఎన్నికల్లో క్రాస్ ఓటింగ్
ముగ్గురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు సస్పెండ్

**మహా:** రాజ్యసభ ఎన్నికల క్రాస్ ఓటింగ్‌కు పాల్పడిన ముగ్గురు ఎమ్మెల్యేలను కాంగ్రెస్ సస్పెండ్ చేసింది. సోఫియా ఫిర్దౌస్, రమేష్ జెనా, దాశరథి గోమాంగో అనే ముగ్గురు ఎమ్మెల్యేలను సస్పెండ్ చేస్తున్నట్లు ఒడిశా కాంగ్రెస్ ప్రకటించింది.

మిగతా 2లో

## భద్రాద్రికి మహర్దశ
### రూ. 300 కోట్లతో ఆలయ అభివృద్ధి ప్రణాళికలు



- సీతారాముల కల్యాణోత్సవానికి ముఖ్యమంత్రి రేవంత్ దంపతులు
- ఉగాది నుంచి భద్రాచలంలో బ్రహ్మోత్సవాల కోలాహలం
- గవర్నర్‌కు ముందస్తు ఆహ్వానాలు.. ఆధ్యాత్మిక శోభ, ప్రగతి మేళవింపు
- అధికారికంగా వెల్లడించిన మంత్రి తుమ్మల

**హైదరాబాద్, మహా:**

దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన పవిత్ర పుణ్యక్షేత్రం భద్రాచలం రాబోయే రోజుల్లో సరికొత్త శోభను సంతరించుకోనుంది. కోట్లాది మంది భక్తుల ఆరాధ్య దైవమైన శ్రీ సీతారామచంద్ర స్వామి వారి కల్యాణోత్సవం, ఆలయ అభివృద్ధి పనుల నేపథ్యంలో ఈ నెల భద్రాద్రి క్షేత్రం ఆధ్యాత్మిక, ప్రగతిదాయక ఘట్టాలకు వేదిక కాబోతోంది. ఈ నెల 27వ తేదీన అత్యంత వైభవంగా జరగనున్న శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొననున్నారని

మిగతా 2లో

## హైదరాబాద్‌లో దారుణం
### బార్లు, రెస్టారెంట్లకు కుళ్లిన చికెన్ సరఫరా.. 800 కిలోల మాంసం పట్టివేత!



**హైదరాబాద్, మహా:** నగరంలో పెరుగుతున్న చికెన్ ధరలను ఆసరాగా చేసుకుని కొందరు అక్రమార్కులు కాసుల కక్కుర్తితో ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. తాజాగా హైదరాబాద్‌లోని పార్శిగుట్ట ప్రాంతంలో కుళ్లిపోయిన చికెన్‌ను నిల్వ ఉంచి వివిధ హోటళ్లకు విక్రయిస్తున్న ఒక భారీ ముఠాను టాస్క్‌ఫోర్స్ , జీహెచ్‌ఎంసీ అధికారులు పకడ్బందీగా పట్టుకున్నారు.సికింద్రాబాద్ పరిధిలోని పార్శిగుట్టలో ఉన్న 'ఏ 1 ఫ్రెష్ చికెన్ షాప్' కేంద్రంగా

మిగతా 2లో



# అడ్డంగా దొరికినా బాబు నో యాక్షన్

## పుట్టా మహేష్ అంశంపై వైఎస్ జగన్ ఫైర్

**తాడేపల్లి, మహా :** డ్రగ్స్ తీసుకుంటూ టీడీపీ ఎంపీ పుట్టా మహేష్ పట్టుబడ్డాడని.. పార్లమెంటు చరిత్రలో డ్రగ్స్ తీసుకుంటూ పట్టుబడ్డ ఎంపీ 'పుట్టా'నేనని వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ఒంగోలు నియోజకవర్గ కార్యకర్తలు, నాయకులు, ప్రజా ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. "పుట్టా మహేష్‌తో మొదలై... పుట్టా మహేష్‌తో ఆగిపోలేదు.. ఇలాంటి వాటిపట్ల చంద్రబాబు వ్యవరించిన తీరు అత్యంత దారుణం" అంటూ వైఎస్ జగన్ దుయ్యబట్టారు. అత్యాచారం చేశారని, ఆపై మోసం చేశారని బాధితురాలు స్వయంగా మోసం చేశారని ముఖ్యమంత్రికి ఫిర్యాదు చేస్తే.. దానిపై కమిటీలు అంట.. కోనేటి ఆదిమూలం మహిళ మీద దారుణమైన లైంగిక దాడిచేస్తే పంచాయితీ చేశారు. కేజీబీవీ మహిళా ప్రిన్సిపాల్ మీద వేధింపులకు పాల్పడ్డ ఆముదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ మీద నో యాక్షన్. ..మహిళలతో అశ్లీల వీడియో కాల్స్ చేసిన గుంటూరు ఈస్ట్ ఎమ్మెల్యే మీద నో యాక్షన్. చివరకు మంత్రి సంధ్యారాణి పీఏ మీదా నో యాక్షన్. ప్రస్తుత టీటీడీ ఛైర్మన్ మీదా నో యాక్షన్. వీడియో, ఫొటోలతో పట్టుబడ్డా.. నో యాక్షన్. ఆదినారాయణరెడ్డి కొడుకు డ్రగ్స్ తీసుకుంటూ.. పట్టుబడితే.. నో యాక్షన్. ఇలాంటి వాటికి వత్తాసు పలికే భావన చంద్రబాబుకు ఉంది కాబట్టే.. ఇలాంటివి జరుగుతున్నాయి" అంటూ వైఎస్ జగన్ మండిపడ్డారు.

# రాజ్యసభ ఎన్నికల్లో క్రాస్ ఓటింగ్

(మొదటిపేజీ తరువాయి)

పార్టీ వ్యతిరేక కార్యకలాపాల కారణంగా ముగ్గురు ఎమ్మెల్యేలను సస్పెండ్ చేసినట్లు వెల్లడించింది. "సోమవారం జరిగిన రాజ్యసభ ఎన్నికల్లో కాంగ్రెస్ శాసనసభ పక్షానికి చెందిన ముగ్గురు సభ్యులు పార్టీ ఆదేశాలను ధిక్కరించి బీజేపీ మద్దతు ఇచ్చిన అభ్యర్థికి ఓటు వేశారు. వారిని తక్షణమే పార్టీ నుంచి సస్పెండ్ చేశాం. పార్టీ వ్యతిరేక కార్యకలాపాల కారణంగా గజపతి జిల్లా కాంగ్రెస్ కమిటీ (DCC) అధ్యక్షుడు, ఎమ్మెల్యే దాశరథి గొమాంగో, సనఖేముండి ఎమ్మెల్యే రమేష్ జెనా, బారాబతికటక్ నియోజకవర్గ ఎమ్మెల్యే సోఫియా ఫిర్దౌస్ ఈ ముగ్గురినీ సస్పెండ్ చేశాం" అని ఒడిశా ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ మీడియా విభాగం ఛైర్మన్ అరబింద దాస్ అన్నారు. అసెంబ్లీలో 14 మంది ఎమ్మెల్యేలు ఉన్న కాంగ్రెస్, నాలుగో రాజ్యసభ స్థానానికి బీజేడీ అభ్యర్థి దత్తేశ్వర్ హోటాకు మద్దతు ప్రకటించింది. అయితే, బీజేడీ, కాంగ్రెస్ ఎమ్మెల్యేల క్రాస్ ఓటింగ్ కారణంగా బీజేపీ మద్దతు తెలిపిన స్వతంత్ర అభ్యర్థి దిలీప్ రే గెలిచారు. రేకు అనుకూలంగా బీజేడీ, కాంగ్రెస్ పార్టీలు వేసిన క్రాస్ ఓటింగ్ వల్ల రాజ్యసభ ఎన్నికల్లో ప్రతిపక్షానికి కేవలం ఒక అభ్యర్థి విజయం మాత్రమే దక్కింది. అటు బీజేపీ సునాయాసంగా రెండు సీట్లను గెలుచుకోగా, ఒక సీటు స్వతంత్ర అభ్యర్థికి దక్కింది. వీరిలో బీజేపీ అభ్యర్థులు మన్మోహన్ సమల్, సుజీత్ కుమార్, బిజూ జనతా దళ్ అభ్యర్థి సంతృప్త మిశ్రా, స్వతంత్ర అభ్యర్థి దిలీప్ రే ఉన్నారు.

# హైదరాబాద్‌లో దారుణం

(మొదటిపేజీ తరువాయి)

ఈ దందా సాగుతున్నట్లు అధికారులకు పక్కా సమాచారం అందింది. దీంతో టాస్క్‌ఫోర్స్, జీహెచ్ఎంసీ ఫుడ్ సేఫ్టీ అధికారులు సంయుక్తంగా మెరుపు దాడులు నిర్వహించారు. ఈ తనిఖీల్లో అధికారులే విస్తుపోయే నిజాలు వెలుగులోకి వచ్చాయి. రోజుల తరబడి ఫ్రీజర్లలో నిల్వ ఉంచిన, తీవ్ర దుర్వాసన వస్తున్న సుమారు 800 కేజీల కుళ్లిపోయిన చికెన్‌ను అధికారులు గుర్తించి అక్కడికక్కడే సీజ్ చేశారు. ఎండల తీవ్రతతో పాటు మార్కెట్లో కిలో చికెన్ ధర రూ.300కి పైగా పలుకుతున్న ప్రస్తుత పరిస్థితులను ఈ ముఠా తమకు అనుకూలంగా మార్చుకుంది. ఎక్కడో చనిపోయిన, కుళ్లిపోయిన కోళ్ల మాంసాన్ని సేకరించి, దానిని నగరంలోని వివిధ బార్లు, వైన్స్, రెస్టారెంట్లకు తక్కువ ధరకు సరఫరా చేస్తున్నట్లు విచారణలో వెల్లడైంది. జనం ఎంతో ఇష్టంగా తినే ఫాస్ట్ ఫుడ్, బిర్యానీలు, బార్లలో ఇచ్చే స్టాటర్స్‌లో ఈ విషతుల్యమైన మాంసాన్నే వాడుతున్నట్లు అధికారులు గుర్తించడం నగరవాసులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది.ప్రజల ఆరోగ్యానికి ప్రాణసంకటంగా మారిన ఈ షాపునకు కనీస అనుమతులు కూడా లేవు. ఏ1 చికెన్ షాపు ట్రేడ్ లైసెన్స్ గడువు ఎప్పుడో ముగిసినప్పటికీ, నిబంధనలకు విరుద్ధంగా గుట్టుచప్పుడు కాకుండా ఈ చీకటి వ్యాపారాన్ని నడుపుతున్నారు. వెంటనే స్పందించిన అధికారులు ఆ షాపును సీజ్ చేసి, ఈ అక్రమ వ్యాపారానికి సూత్రధారి అయిన ప్రధాన నిర్వాహకుడు షకీల్‌తో పాటు అతనికి సహకరిస్తున్న మరికొందరిని అదుపులోకి తీసుకున్నారు. ప్రస్తుతం పోలీసులు ఈ ఘటనపై కేసు నమోదు చేసి లోతైన దర్యాప్తును ముమ్మరం చేశారు. అరెస్టయిన నిందితుల నుంచి సమాచారం రాబట్టి, ఈ కుళ్లిన చికెన్‌ను ఏయే రెస్టారెంట్లకు, బార్లకు సరఫరా చేశారనే కోణంలో కూపీ లాగుతున్నారు.

# పశ్చిమాసియా రణభేరి

(మొదటిపేజీ తరువాయి)

భారతదేశం తన చమురు అవసరాల్లో అత్యధిక శాతం దిగుమతులపైనే ఆధారపడుతున్నందున, ఈ యుద్ధ ప్రత్యక్ష ప్రభావం మన దేశ ఎగుమతులు, దిగుమతులు, ద్రవ్యోల్బణంపై పడే అవకాశం ఉందని ఆర్థిక నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఈ తీవ్ర పరిణామాలను ముందుగానే పసిగట్టిన కేంద్ర ప్రభుత్వం, పరిస్థితి చేయిజారక ముందే దేశీయంగా పటిష్టమైన చర్యలు చేపట్టేందుకు రేపటి కేబినెట్ సమావేశాన్ని ఒక వ్యూహాత్మక వేదికగా మలుచుకోనుంది. ముఖ్యంగా ప్రతి సామాన్యుడి దైనందిన జీవితంతో ముడిపడి ఉన్న గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు, వాటి నిరంతర సరఫరాపై ఈ సమావేశంలో సుదీర్ఘంగా చర్చించనున్నారు. ఇప్పటికే అంతర్జాతీయ మార్కెట్లో చమురు ధరల్లో తీవ్రమైన ఒడిదుడుకులు చోటుచేసుకుంటున్నాయి. దేశంలో ఇంధన కొరత ఉందనే వదంతులతో స్వార్థపరులు కృత్రిమ కొరత సృష్టించి బ్లాక్ మార్కెట్ దందాలకు తెరలేపే ప్రమాదం ఉందని ప్రభుత్వం ముందే గ్రహించింది. గ్యాస్ మరియు పెట్రోల్ సరఫరాను అడ్డుకొని ధరలు పెంచాలని చూస్తే అత్యవసర వస్తువుల చట్టం (ఎస్మా) కింద కఠిన చర్యలు తీసుకుంటామని కేంద్రం ఇప్పటికే స్పష్టమైన హెచ్చరికలు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో, దేశవ్యాప్తంగా ఉన్న ఏ ఒక్క పెట్రోల్ బంక్‌లోనూ, గ్యాస్ ఏజెన్సీలోనూ భవిష్యత్తులో కొరత తలెత్తకుండా చూడటానికి అవసరమైన దృఢమైన కార్యాచరణను రేపటి కేబినెట్ భేటీలో ఖరారు చేయనున్నారు.అంతర్జాతీయంగా ముంచుకొస్తున్న ఈ ఆర్థిక ప్రతికూలతల నుండి దేశాన్ని రక్షించడానికి ప్రధాని మోడీ నేతృత్వంలోని మంత్రివర్గం ఒక బలమైన కవచాన్ని సిద్ధం చేస్తోంది. చమురు ధరల భారం సామాన్య ప్రజలపై పడకుండా చూసేందుకు అవసరమైన ఆర్థిక ప్రణాళికలు, ముడి చమురు రిజర్వ్ నిల్వల వినియోగం, అలాగే దేశవ్యాప్తంగా ఇంధన పంపిణీ వ్యవస్థలో ఎక్కడా అంతరాయం లేకుండా చూడటం వంటి వ్యూహాత్మక అంశాలపై మంత్రులు మేధోమథనం చేయనున్నారు. మొత్తానికి, ప్రపంచ పరిణామాలను నిశితంగా గమనిస్తూ, భారతీయ ఆర్థిక స్థిరత్వాన్ని కాపాడేందుకు రేపు మధ్యాహ్నం జరిగే ఈ సమావేశం అత్యంత ప్రతిష్టాత్మకంగా మారబోతోంది. ఇప్పుడు యావత్ దేశ ప్రజల దృష్టి ఢిల్లీ వైపే కేంద్రీకృతమై ఉంది.

# నాకు నయనతార కావాలి

## అన్నాడీఎంకే ఎంపీ వివాదాస్పద వ్యాఖ్యలు





**మహా:** అన్నా డీఎంకే రాజ్యసభ ఎంపీ సీ వేణుగోపాల్ షణ్ముగం వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. తనకు హీరోయిన్ నయనతార కావాలని, ఈ కోరికను తీరుస్తారా అని సీఎం స్టాలిన్‌ను ఆయన ప్రశ్నించారు. ఎవరికైనా నయనతారను పెళ్లి చేసుకోవాలని ఉంటే, ఆ కోరికను ముఖ్యమంత్రి నెరవేరుస్తారా అని అడిగారు. సీఎం స్టాలిన్ తాజాగా ప్రకటించిన 'మీ కలను మాతో చెప్పండి' కార్యక్రమాన్ని ఉద్దేశించి వేణుగోపాల్ షణ్ముగం ఈ కామెంట్స్ చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా వలంటీర్లు ఇంటింటికి తిరిగి, ప్రభుత్వం నుంచి ప్రజలు కోరుకునే అంశాలను, పాలనపై ఇచ్చే సలహాలు, సూచనలను తెలుసుకుంటారు. డీఎంకే ప్రభుత్వ పాలనా వైఫల్యం, మహిళలపై నేర ఘటనల పెరుగుదల, శాంతిభద్రతలకు భంగం వాటిల్లడం వంటి అంశాలపై రాష్ట్రవ్యాప్తంగా అన్నాడీఎంకే నిరసన కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ఈసందర్భంగా తన సొంత జిల్లా విల్లుపురంలో జరిగిన నిరసన కార్యక్రమం వేదికగా రాజ్యసభ ఎంపీ సీ వేణుగోపాల్ షణ్ముగం ఈ కామెంట్స్ చేశారు.

**ఉచిత భార్యల పథకం వ్యాఖ్యలతో దుమారం**

మహిళలపై షణ్ముగం అశ్లీల వ్యాఖ్యలు చేయడం ఇదే తొలిసారేం కాదు. ఉచిత భార్యల పథకాన్ని కూడా సీఎం స్టాలిన్ ప్రకటించాలని గతేడాది ఆయన వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల హామీల అమల్లో భాగంగా ఉచిత భార్యల పథకాన్ని ప్రకటించాలని సీఎం స్టాలిన్‌ను డిమాండ్ చేశారు. ఈ కామెంట్స్‌పై నా అందరిలో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. ఇంత దారుణమైన వ్యాఖ్యలు చేయడం సరికాదనే అభిప్రాయాన్ని అన్ని పార్టీల నేతలు వ్యక్తం చేశారు.

# ఢిల్లీ వేదికగా కాంగ్రెస్ అగ్రనేతల మంతనాలు

## ఏఐసీసీ పెద్దలతో సీఎం రేవంత్, పీసీసీ చీఫ్ కీలక భేటీ



**ఢిల్లీ, మహా:** తెలంగాణ రాష్ట్రంలో అసెంబ్లీ, శాసనమండలి సమావేశాలు ముగిసిన వెంటనే ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ హుటాహుటిన ఢిల్లీ బాట పట్టారు. మంగళవారం రాత్రి వారు హస్తినకు చేరుకుని కాంగ్రెస్ పార్టీ అధిష్టానంతో అత్యంత కీలకమైన సమావేశాలు నిర్వహించారు. రాష్ట్ర రాజకీయాల్లో చోటుచేసుకుంటున్న తాజా పరిణామాలను ఎప్పటికప్పుడు జాతీయ నాయకత్వానికి వివరించడంతో పాటు, భవిష్యత్ వ్యూహాలపై మార్గనిర్దేశం పొందే దిశగా ఈ పర్యటన అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది.ముఖ్యంగా ఈ ఉన్నత స్థాయి భేటీ ఇటీవల తెలంగాణ నుంచి జరిగిన రాజ్యసభ ఎన్నికల నేపథ్యంలో జరగడం గమనార్హం. జాతీయ స్థాయిలో పార్టీకి ఎంతో కీలకమైన సీనియర్ న్యాయవాది, నేత అభిషేక్ మను సింఘ్వి, అలాగే ముఖ్యమంత్రికి అత్యంత ఆప్తుడు, సలహాదారు అయిన వేం నరేందర్ రెడ్డిలు తెలంగాణ కోటాలో రాజ్యసభకు ఎన్నికైన విషయం తెలిసిందే. ఎటువంటి ఆటంకాలు లేకుండా ఈ ఎన్నికల ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసిన తర్వాత, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కలిసి కృతజ్ఞతలు తెలపడానికి రాష్ట్ర నేతలు వెళ్లారు. ముఖ్యమంత్రి, పీసీసీ చీఫ్‌తో పాటు రాజ్యసభకు కొత్తగా ఎన్నికైన వేం నరేందర్ రెడ్డి, పార్టీకి చెందిన లోక్‌సభ సభ్యులు మల్లు రవి, సురేష్ షెట్కర్, బలరామ్ నాయక్ తదితరులు కూడా ఈ ప్రతినిధి బృందంలో ఉండి అధిష్టానాన్ని కలిశారు.ఈ ఢిల్లీ పర్యటనలో భాగంగా రాష్ట్ర కాంగ్రెస్ బృందం ముందుగా ఏఐసీసీ సంస్థాగత వ్యవహారాల ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో సమావేశమై పార్టీకి సంబంధించిన పలు అంతర్గత అంశాలపై చర్చించారు. ఆ తర్వాత కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ కీలక భేటీలో రాష్ట్రంలో నెలకొన్న తాజా రాజకీయ పరిస్థితులు, ప్రభుత్వ పనితీరు, ప్రతిపక్షాల విమర్శలను తిప్పికొడుతున్న తీరు, అలాగే క్షేత్ర స్థాయిలో పార్టీ బలోపేతం కోసం తీసుకుంటున్న చర్యల గురించి వారు సుదీర్ఘంగా విశ్లేషించారు. రాజ్యసభ ఎన్నికలను విజయవంతంగా పూర్తి చేయడంతో పాటు, రాష్ట్రంలో పార్టీని, ప్రభుత్వాన్ని సమర్థవంతమైన సమన్వయంతో ముందుకు తీసుకెళ్తున్నందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఈ సందర్భంగా మల్లికార్జున ఖర్గే ప్రత్యేకంగా అభినందించారు.మొత్తం మీద చూస్తే.. ఒకవైపు అసెంబ్లీ సమావేశాల్లో ప్రతిపక్షాలను దీటుగా ఎదుర్కొని, మరోవైపు రాజ్యసభ స్థానాలను సునాయాసంగా కైవసం చేసుకున్న ఆత్మవిశ్వాసంతో తెలంగాణ కాంగ్రెస్ నేతలు అధిష్టానాన్ని కలవడం విశేషం. రాష్ట్ర నాయకత్వానికి, జాతీయ నాయకత్వానికి మధ్య ఉన్న అద్భుతమైన సమన్వయానికి, పరస్పర అవగాహనకు ఈ సమావేశం ఒక స్పష్టమైన నిదర్శనంగా రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.

# జీవన్ రెడ్డి వైపు బీజేపీ చూపు

## కిషన్ రెడ్డి, రాంచందర్ రావులతో మాట్లాడిన ఎంపీ అరవింద్

## పార్టీలోకి ఆహ్వానించే అంశంపై చర్చ.. రంగంలోకి దిగిన నేతలు



**హైదరాబాద్, మహా :** కాంగ్రెస్ పార్టీపై కోపంతో రగిలిపోతున్న జగిత్యాల జిల్లాకు చెందిన సీనియర్ నేత జీవన్ రెడ్డి కదలికలపై బీజేపీ నేతలు దృష్టి సారించారు. గత కొంత కాలంగా జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ వర్సెస్ జీవన్ రెడ్డి అన్నట్లుగా జిల్లా రాజకీయాలు సాగడం, సంజయ్ వైపు పార్టీ నాయకత్వం మొగ్గు చూపుతుందన్న ఆగ్రహంతో ఉన్న జీవన్ రెడ్డి గుడ్ బై చెప్పేందుకు సిద్ధం కావడంతో ఆయనను పార్టీలోకి ఆహ్వానించే అంశంపై బీజేపీ నేతల మధ్య చర్చ జరిగింది. పార్టీలోకి జీవన్ రెడ్డిని ఆహ్వానిస్తే జగిత్యాల జిల్లాలో బలం చేకూరుతుందని, ఆయన సుదర్ఘ రాజకీయ అనుభవం కూడా పార్టీకి కలిసి వస్తుందని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ కొంత కాలంగా భావిస్తున్నారు. అంతే కాకుండా సంజయ్, జీవన్ రెడ్డిల మధ్య జరుగుతున్న అంతర్గత పోరుపై కాంగ్రెస్ అధిష్టానం స్పందించక పోవడం, జీవన్ రెడ్డికి పార్టీ అన్యాయం చేస్తుందంటూ గతంలోనే అరవింద్ బహిరంగంగానే వ్యాఖ్యానించారు. తాజా పరిణమాల నేపథ్యంలో జీవన్ రెడ్డి పార్టీ వీడటం ఖాయమని బలంగా వినిపిస్తుండటంతో ఆయనను పార్టీలోకి ఆహ్వానించే అంశంపై ఎంపీ అరవింద్ కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావుతో మాట్లాడారు. పార్టీ అనుతిస్తే తాను రంగంలోకి దిగుతానని, అంతకంటే ముందు ఒక సారి జీవన్ రెడ్డికి సానుభూతి తెలుపుతూ మాట్లాడితే బాగుంటుందని సూచించారు. అరవింద్ సూచనకు సమ్మతించిన నేతలిద్దరూ జీవన్ రెడ్డితో మాట్లాడే అంశంపై కేంద్ర పెద్దలతో సంప్రదించినట్లు సమాచారం. ఏది ఏమైనా నిజామాబాద్ ఎంపీ పరిధిలోకి జగిత్యాల జిల్లా కూడా రావడంతో తన భవిష్యత్ రాజకీయ అవసరాల దృష్ట్యా అరవింద్ పార్టీ పెద్దలను ఒప్పించారన్న ప్రచారం జరుగుతోంది. సుదీర్ఘ రాజకీయ చరిత్ర కలిగిన జీవన్ రెడ్డి ఎమ్మెల్యేగా, ఎమ్మెల్సీగా, మంత్రిగా, పార్లమెంట్ సభ్యుడిగా కూడా పని చేశారు. ఆయన బీజేపీలో చేరితే జగిత్యాల జిల్లాతో పాటు నిజామాబాద్, కరీంనగర్ లోక్ సభ స్థానాలలోనూ పార్టీ పెరగడంతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా పార్టీకి ఒక ఊపు వచ్చే అవకాశాలున్నాయని కాషాయదళంలో చర్చ మొదలైంది. అయితే ఇప్పటికే జీవన్ రెడ్డి బీఆర్ఎస్ లో చేరేందుకు నిర్ణయించుకున్నారని, ఈ నెల 27న గులాబీ కండువాను కప్పుకుంటారన్న ప్రచారం ఉంది. మరో పక్క కాంగ్రెస్ పార్టీ జీవన్ రెడ్డిని బుజ్జగించేందుకు అందుబాటులో ఉన్న అన్న ప్రయత్నాలను ముమ్మరం చేసింది. ఈ తరుణంలో ఆయన పనమెటు అన్నది మరోసారి చర్చనీయాంశంగా మారింది.

# భారీ కల్తీ అల్లం వెల్లుల్లి పేస్ట్ దందా రట్టు..

## కుళ్లిన పదార్థాలు, యాసిడ్‌తో తయారీ!

**హైదరాబాద్, మహా:** హైదరాబాద్ నగరంలో ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న కల్తీ రాయుళ్ల గుట్టును పోలీసులు రట్టు చేశారు. బోరబండలోని మధురానగర్‌లో నిబంధనలకు విరుద్ధంగా, అత్యంత అపరిశుభ్రమైన వాతావరణంలో కల్తీ అల్లం వెల్లుల్లి పేస్ట్ తయారు చేస్తున్న ఓ కేంద్రంపై ఖైరతాబాద్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు, జీహెచ్ఎంసీ ఫుడ్ సేఫ్టీ అధికారులు సంయుక్తంగా మెరుపుదాడి చేశారు. ఈ దాడుల్లో ప్రజల ఆరోగ్యాన్ని హరించే ఎన్నో విస్తుపోయే నిజాలు వెలుగుచూశాయి.

**ప్రమాదకరమైన తయారీ విధానం**

'ఏ1 సహారా గోల్డ్' అనే నకిలీ బ్రాండ్ పేరుతో నిందితులు ఈ అక్రమ దందా సాగిస్తున్నారు. కేవలం లాభార్జనే ధ్యేయంగా కుళ్లిపోయిన అల్లం, వెల్లుల్లి, మరియు పనికిరాని వెల్లుల్లి పొట్టును ముడిసరుకుగా వాడుతున్నారు. ఆ కుళ్లిన మిశ్రమానికి ఘాటు రావడం కోసం ప్రమాదకరమైన అసిటిక్ యాసిడ్ , నిల్వ ఉండేందుకు అధిక మొత్తంలో ఉప్పు కలిపి ఈ పేస్ట్‌ను తయారు చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. కనీస ఫుడ్ సేఫ్టీ నిబంధనలను పాటించకుండా, దుమ్ము, ఈగలు వాలుతున్న ప్లాస్టిక్ టబ్బులలో ఈ పేస్ట్‌ను నిల్వ ఉంచడం వారి నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది.

**నిర్వాహకుడి అరెస్ట్, వస్తువుల సీజ్**

ఈ కల్తీ కేంద్రం నిర్వాహకుడు మొహమ్మద్ అబ్దుల్లాను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ ఆకస్మిక దాడిలో భారీగా ముడిసరుకును, తయారీకి ఉపయోగించే యంత్రాలను అధికారులు సీజ్ చేశారు. ఇందులో వేల కిలోల వెల్లుల్లి, అల్లం, వందల కిలోల ఉప్పు, ప్యాకింగ్ కవర్లతో పాటు మిక్సర్, గ్రైండర్, పీలింగ్ మెషీన్లు ఉన్నాయి. ఈ సామగ్రి అంతా స్వాధీనం చేసుకున్న పోలీసులు, తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం నిందితుడిని స్థానిక పోలీసులకు అప్పగించారు.

**హోటళ్లు, క్యాటరింగ్‌లకే ప్రధాన సరఫరా**



అత్యంత తక్కువ ఖర్చుతో తయారైన ఈ ప్రమాదకరమైన కల్తీ పేస్ట్‌ను నగరంలోని వివిధ హోల్‌సేల్ కిరాణా దుకాణాలకు, ఫుడ్ క్యాటరింగ్ సర్వీసులకు, హోటళ్లకు సరఫరా చేస్తూ నిందితుడు భారీగా సొమ్ము చేసుకుంటున్నట్లు విచారణలో తేలింది. మనం బయట తినే ఆహారంలో ఇలాంటి కల్తీ పేస్ట్ ఉపయోగిస్తుండటం ఆందోళన కలిగించే విషయం. మార్కెట్లో దొరికే ఇలాంటి కల్తీ ఆహార పదార్థాల పట్ల ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని, కొనుగోలు చేసే ముందు బ్రాండ్ మరియు నాణ్యతను ఒకటికి రెండుసార్లు తనిఖీ చేసుకోవాలని అధికారులు హెచ్చరిస్తున్నారు

# భద్రాద్రికి మహర్దశ

(మొదటిపేజీ తరువాయి)

రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అధికారికంగా ప్రకటించారు. కేవలం స్వామివారి కల్యాణోత్సవంలో పాల్గొనడమే కాకుండా, భద్రాచలం ఆలయ సమగ్ర అభివృద్ధికి ఉద్దేశించిన బృహత్తర ప్రణాళికలకు ముఖ్యమంత్రి స్వయంగా శ్రీకారం చుట్టనుండటం ఈ పర్యటనకు అత్యంత ప్రాధాన్యతను సంతరించిపెట్టింది. ఆలయ ప్రాంగణం, భక్తుల వసతుల కల్పన, క్యూలైన్ల క్రమబద్ధీకరణ తదితర మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏకంగా మూడు వందల కోట్ల రూపాయలతో ఒక ప్రతిష్టాత్మక ప్రణాళికను సిద్ధం చేసింది. ఎన్నో ఏళ్లుగా భక్తులు, స్థానికులు ఎదురుచూస్తున్న ఆలయ మాస్టర్ ప్లాన్ ఇప్పుడు కార్యరూపం దాల్చబోతోంది. ఇందులో భాగంగా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన పర్యటనలో భాగంగా తొలి విడతగా వంద కోట్ల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టనున్న పనులకు లాంఛనంగా శంకుస్థాపన చేయనున్నారు. ఈ నిధులతో ఆలయ మాడ వీధుల విస్తరణ, దూరప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు మెరుగైన బస సౌకర్యాలు, విశాలమైన అన్నదాన సత్రాల నిర్మాణం వంటి కీలకమైన పనులు వేగవంతం కానున్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ నిర్ణయం ద్వారా ఆధ్యాత్మిక పర్యాటక రంగంలో భద్రాచలం దేశవ్యాప్తంగా తనదైన ముద్రను మరింత బలంగా వేయనుంది. మరోవైపు, తెలుగు వారి తొలి పండుగ ఉగాది పర్వదినం రోజున భద్రాచలంలో శ్రీ సీతారామచంద్ర స్వామి వారి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా ప్రారంభం కానున్నాయి. ఈ బ్రహ్మోత్సవాల కోసం దేవస్థానం అధికారులు సర్వం సిద్ధం చేస్తున్నారు. ఈ పవిత్రమైన బ్రహ్మోత్సవాల వేడుకలకు రాష్ట్ర ప్రథమ పౌరుడు, గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాతో పాటు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దంపతులను సైతం ఆలయ అధికారులు మరియు ప్రభుత్వం అధికారికంగా ఆహ్వానించనున్నారు. గవర్నర్, ముఖ్యమంత్రి ఇరువురు ఒకే పండుగ వాతావరణంలో భద్రాద్రి రామయ్య సేవలో పాల్గొననుండటం రాష్ట్ర ప్రజల్లో మరింత ఉత్సాహాన్ని నింపుతోంది. మంత్రులు, ఉన్నతాధికారులు సైతం ఈ కార్యక్రమాలను విజయవంతం చేయడానికి ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తూ, కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నారు. సమగ్రంగా విశ్లేషిస్తే, రాష్ట్ర ప్రభుత్వం భద్రాచలం క్షేత్రం పట్ల తీసుకుంటున్న ఈ నిర్ణయాలు చారిత్రాత్మకమైనవిగా చెప్పవచ్చు. ఒకవైపు అత్యంత భక్తిశ్రద్ధలతో సీతారాముల కల్యాణోత్సవాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించడం, మరోవైపు వందల కోట్ల రూపాయలతో ఆలయ సమగ్ర అభివృద్ధికి బాటలు వేయడం ద్వారా ప్రభుత్వం హిందూ ధార్మిక క్షేత్రాల పరిరక్షణకు, అభివృద్ధికి కట్టుబడి ఉన్నట్లు స్పష్టమవుతోంది. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్థానిక చొరవ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయాత్మక చర్యలు భద్రాద్రికి పూర్వ వైభవాన్ని తీసుకురావడమే కాకుండా, రాబోయే తరాలకు ఒక సుందరమైన, సర్వసౌకర్యాలతో కూడిన ఆధ్యాత్మిక కేంద్రంగా భద్రాచలాన్ని నిలబెట్టడంలో కీలక పాత్ర పోషించనున్నాయి. భక్తుల కొంగుబంగారమైన భద్రాద్రి రామయ్యకు ఇది నిజంగానే ఒక మహర్దశ అని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు.

# దద్దరిల్లిన అసెంబ్లీ

(మొదటిపేజీ తరువాయి)

గల్లీల్లో చెత్త కుప్పలు పేరుకుపోతుంటే, పాలకులు మాత్రం ఢిల్లీకి విమాన యాత్రలు చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో నోటిఫికేషన్లు 'నిల్'.. లూటిఫికేషన్లు 'ఫుల్' అని ఆరోపించారు. పెన్షనర్లకు టీఏ, డీఏలు రాక నరకయాతన పడుతున్నారని, గ్యారంటీ కార్డులు కాస్తా ఇప్పుడు 'బాకీ కార్డులుగా' మారి వెక్కిరిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రజల సొమ్ముతో ఇతర రాష్ట్రాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఫుల్ పేజీ ప్రకటనలు ఇస్తూ ఎన్నికల ప్రచారం చేసుకుంటోందని కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. జార్జ్ ఆర్వెల్ మాటలను గుర్తు చేస్తూ.. 'మోసాల కాలంలో నిజం చెప్పడమే అతి గొప్ప విప్లవం' అని, తాము కూడా ప్రజల గొంతుకగా అసెంబ్లీలో నిజాలను ప్రస్తావిస్తున్నామని కేటీఆర్ స్పష్టం చేశారు. కాంగ్రెస్ ఇచ్చింది 'అభయహస్తం' అని చెప్పుకుంటున్నా, అమలులో అది 'భస్మాసుర హస్తం'గా మారిందని విమర్శించారు. రెండేళ్లు గడుస్తున్నా ప్రతి కుటుంబానికి రావాల్సిన రూ. 2.50 లక్షల లబ్ధి అందిన ఒక్క కుటుంబమైనా రాష్ట్రంలో ఉందా అని ప్రశ్నించారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ 'దానకర్ణుడి'లా సాధ్యం కాని హామీలు ఇచ్చిందని, అధికారంలోకి వచ్చాక ఆ హామీలను అమలు చేయకుండా 'కుంభకర్ణుడి'లా నిద్రపోతోందని విమర్శించారు.

## డ్రగ్స్ టెస్టుకు

# కేసీఆర్ రావాలి

- సీఎంనూ తీసుకువస్తా
- టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్ సవాల్

**హైదరాబాద్,మహా:** డ్రగ్ టెస్టుకు కాంగ్రెస్ నాయకులందరూ సిద్ధంగా ఉన్నారని పీసీసీ చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. సభానాయకుడు, ప్రతిపక్ష నేతకు డ్రగ్ టెస్టు జరగాలని, డ్రగ్స్ టెస్టుకు కేసీఆర్ రావాలని... సీఎంనూ తీసుకువస్తామన్నారు. సభ్యులందరం డ్రగ్ టెస్టు చేయించుకుందాం.. మంచి సందేశం ఇద్దామన్నారు. శాసనమండలిలో డ్రగ్స్ అంశంపై పీసీసీ చీఫ్ మాట్లాడారు. బీఆర్ఎస్ సభ్యులకు కౌంటర్ ఇచ్చారు.

## అక్షర చిట్‌ఫండ్ ఎండీపై ఆదిలాబాద్‌లో 12 కేసులు నమోదు

### ఎస్పీ అఖిల్ మహాజన్

**ఆదిలాబాద్, మహా:** అక్షర చిట్‌ఫండ్ ఎండీ, ఛైర్మన్ పేరాల శ్రీనివాసరావును అరెస్టు చేసినట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. అక్షర చిట్‌ఫండ్ ఎండీపై ఆదిలాబాద్‌లో 12 కేసులు నమోదు అయ్యాయని, అక్షర చిట్‌ఫండ్‌పై రాష్ట్రవ్యాప్తంగా 63 చీటింగ్ కేసులు నమోదయ్యాయన్నారు. ఖాతాదారులకు గడువులోపు డబ్బు చెల్లించట్లేదని ఫిర్యాదులతో కేసు నమోదుచేశామన్నారు. డబ్బు చెల్లించకుండా తప్పించుకు తిరుగుతున్నారని ఆరోపణలు చేశారు.

## వైఎస్ జగన్‌ని మర్యాదపూర్వకంగా

# కలిసిన రేగిడి లక్ష్మణరావు

## పార్టీ గళాన్ని బలంగా వినిపించాలని దిశానిర్దేశం



**తాడేపల్లి,మహా:** వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని రాష్ట్ర అధికార ప్రతినిధి, ప్రసార మాధ్యమాల వక్త రేగిడి లక్ష్మణరావు మర్యాదపూర్వకంగా కలిశారు. తనపై నమ్మకంతో పార్టీలో కీలక బాధ్యతలు అప్పగించినందుకు జగన్ మోహన్ రెడ్డికి ఆయన పుష్పగుచ్ఛం అందించి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. రాష్ట్రంలో ప్రస్తుత రాజకీయ పరిణామాలు, మారుతున్న సమీకరణాలు, ప్రజలు క్షేత్రస్థాయిలో ఎదుర్కొంటున్న సమస్యలపై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చ జరిగింది.కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టడంలో పార్టీ గొంతుకను ప్రసార మాధ్యమాల వేదికగా మరింత బలంగా వినిపించాలని అధినేత జగన్ ఈ సందర్భంగా లక్ష్మణరావుకు దిశానిర్దేశం చేశారు. ప్రతిపక్ష పాత్రలో ఉన్నప్పుడు ప్రజల పక్షాన పోరాడటం ఎంతో కీలకమని ఆయన సూచించారు. అధికార పార్టీ వైఫల్యాలను, వారు ఇచ్చిన హామీల అమలులోని డొల్లతనాన్ని ఎప్పటికప్పుడు ప్రజల్లోకి తీసుకెళ్లడంలో అధికార ప్రతినిధుల పాత్ర అత్యంత ముఖ్యమైనదని స్పష్టం చేశారు. పూర్తి బాధ్యతాయుతంగా వ్యవహరించి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని చెప్పారు.జగన్ మోహన్ రెడ్డి తనపై ఉంచిన విశ్వాసాన్ని ఏమాత్రం వమ్ము చేయనని రేగిడి లక్ష్మణరావు స్పష్టం చేశారు. పార్టీ సిద్ధాంతాలను, అధినేత ఆశయాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడంతో పాటుగా అన్ని వేదికలపై వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ వాణిని అత్యంత సమర్థవంతంగా వినిపిస్తానని ఆయన భరోసా ఇచ్చారు. ప్రతిపక్షాలపై జరుగుతున్న దాడులు, అక్రమ కేసులపై చట్టపరంగా ప్రజాక్షేత్రంలో అలుపెరగని పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. రానున్న రోజుల్లో పార్టీ విజయానికి తన వంతుగా నిరంతరం సైనికుడిలా శ్రమిస్తానని ఆయన పునరుద్ఘాటించారు.

## జగ్గారెడ్డి అంటే అందరికీ ఇష్టమే

- పీసీసీపై హైకమాండేదే తుది నిర్ణయం
- జీవన్ రెడ్డి విషయంలో పీసీసీదే బాధ్యత
- మంత్రి శ్రీధర్ బాబు చిట్ చాట్

**హైదరాబాద్, మహా :** ముఖ్యమంత్రి పదవిపై తెలంగాణ కాంగ్రెస్ సీనియర్ నేత, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కీలక వ్యాఖ్యలు చేశారు. మంగళవారం అసెంబ్లీ ఆవరణలో మీడియాతో చిట్‌చాట్ చేశారు. మాజీ మంత్రి జీవన్ రెడ్డి విషయంలో పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ చొరవ చూపాలని అభిప్రాయపడ్డారు. జీవన్ రెడ్డి పార్టీ మారొద్దని తాను కోరుతున్నట్లు తెలిపారు. జగ్గారెడ్డి అంటే అందరికీ ఇష్టమే.. పీసీసీపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తన మనసులోని మాట చెప్పారని క్లారిటీ ఇచ్చారు. పీసీసీ పదవిపై అధిష్టానిదే తుది నిర్ణయమన్నారు. 'నామినేటెడ్ పదవులపై కసరత్తు జరుగుతోంది. పోర్ట్ ఫోలియోల కేటాయింపులపై సీఎందే తుది నిర్ణయం. కేసీఆర్ గొప్ప అనుభవజ్ఞుడు.. ఆయన సభకు రావాలి. ఆయన సలహాలు సూచనలు స్వీకరిస్తాం. మళ్లీ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ముఖ్యమంత్రి ఎవరనేది ఏఐసీసీ నిర్ణయం తీసుకుంటుంది' అని శ్రీధర్ బాబు స్పష్టం చేశారు.

## 6 గ్యారంటీల అమలులో ప్రభుత్వం విఫలం



**వేములవాడ,మహా:** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన 6 గ్యారంటీలను అమలు చేయడంలో పూర్తిగా వైఫల్యం చెందిందని వేములవాడ పట్టణ బీజేపీ నాయకులు విమర్శించారు. మంగళవారం గ్యారంటీలను తక్షణమే అమలు చేసి ప్రజలకు అందించాలని కోరుతూ తహసిల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేసి అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు రాపెల్లి శ్రీధర్ బీజేపీ రాష్ట్ర నాయకులు ప్రతాప రామకృష్ణ, రేగుల మల్లికార్జున్, కౌన్సిలర్లు కొండ్లెపు ముత్యం, మైలారం శ్రీనివాస్, వంగల శ్రీనివాస్,రేగుల శ్రీకాంత్, బోనాల శివ, మామిండ్ల లక్ష్మీరాజం రేగుల రాజ్ కుమార్, బిల్ల కృష్ణ, గుడిసె మనోజ్ కుమార్, వివేక్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. అనంతరం తెలంగాణ చవితిలో నిండు అసెంబ్లీలో వందేమాతరం గీతాన్ని అవమానించి బహిష్కరించి వెళ్లిన ఎంఐఎం పార్టీ దిష్టిబొమ్మ దగ్ధం చేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతదేశంలో నివసించాలంటే జాతీయగీతం వందేమాతర గీతం ఆలపించాల్సిందేనని హెచ్చరించారు

## మద్యపాన రహిత గ్రామంగా నంది కంది

**మార్పు దిశగా కీలక అడుగు**



**మహా: సంగారెడ్డి ప్రతినిధి:** సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండలంలోని నంది కంది గ్రామం సామాజిక మార్పులో ఆదర్శంగా నిలిచింది. గ్రామస్థుల ఆరోగ్యం, కుటుంబాల ఆర్థిక అభివృద్ధి, శాంతిభద్రతలను మెరుగుపరచడమే లక్ష్యంగా గ్రామంలో సంపూర్ణ మద్య నిషేధాన్ని అమలు చేస్తూ సర్పంచ్ స్రవంతి విజయభాస్కర్ రెడ్డి అధ్యక్షతన పంచాయతీ ఏకగ్రీవ తీర్మానం చేసింది. మద్యం కారణంగా కుటుంబాలు చితికిపోవడాన్ని గమనించిన సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు ఈ కఠిన నిర్ణయం తీసుకున్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే భారీ జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. ఈ నిర్ణయం పట్ల ముఖ్యంగా మహిళలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## సహస్రను అభినందించిన కౌన్సిలర్ మాణెమ్మ



**మహా : సంగారెడ్డి :** భైంసా లో నిర్వహించిన కేలో ఇండియా లో గోల్డ్ మెడల్ సాధించిన నందిగారి సహస్ర ను వారి తల్లి దండ్రులు సంతోష్ మంజులను మంగళవారం సదాశివపేట 6వ వార్డు కౌన్సిలర్ మాణెమ్మ, బిఆర్ఎస్ నాయకులు నాగుల విజయ్ కుమార్ లు శాలువాతో సన్మానించి అభినందించారు. అనంతరం కౌన్సిలర్ నాగుల మాణెమ్మ మాట్లాడుతూ సహస్ర భవిష్యత్తులో మరిన్ని పథకాలు సాధించాలని ఉన్నత స్థానానికి ఎదగాలని ఆకాంక్షించారు. అలాగే వీరశైవ సంఘం ఆధ్వర్యంలో సహస్రను ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో వీరశైవ సమాజం జిల్లా గౌరవ అధ్యక్షులు చంద్రశేఖర్ స్వామి, ప్రధాన కార్యదర్శి కె సురేందర్, ఉపాధ్యక్షులు HR మధు, గాండ్ల కృష్ణ, సంగిశెట్టి, రమేష్, బసవరాజ్, విజయ్ కుమార్, స్వరూప, వీరమని తదితరులు పాల్గొన్నారు.

## ఉగాదికి ఇందిరమ్మ ఇండ్ల పండుగ



- సామూహిక గృహప్రవేశాలకు సిద్ధం కావాలి..
- ఎంపీడీవోలకు జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ ఆదేశం..
- ఏప్రిల్ 2న 'ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక' గ్రామసభలు..

**నల్గొండ,మహా :** జిల్లాలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను ఉగాది పర్వదినం నాటికి పూర్తి చేసి సామూహిక గృహప్రవేశాలకు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి ఎంపీడీవోలు, జిల్లా అధికారులతో వివిధ అభివృద్ధి పనులపై ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. స్థానిక శాసనసభ్యుల సమ్మతితో గృహప్రవేశాల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని సూచించారు.

**పెండింగ్ బిల్లులు చెల్లించాలి..**

ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే విడుదల చేయాలని అదేవిధంగా వ్యక్తిగత మరుగుదొడ్ల (ISL) బిల్లుల చెల్లింపు ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఉపాధి హామీ పథకం కింద మంజూరైన పాఠశాల టాయిలెట్లు, గ్రామ సమాఖ్య భవనాలు, గ్రామ పంచాయతీ, అంగన్‌వాడీ భవనాల నిర్మాణాలను వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు. పనులు ప్రారంభించని పక్షంలో అందుకుగల కారణాలతో కూడిన నివేదికను సమర్పించాలన్నారు.

**గ్రామసభల్లో లబ్ధిదారుల జాబితా**

వచ్చే నెల ఏప్రిల్ 2న నిర్వహించనున్న 'ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక' గ్రామసభల కోసం పక్కాగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. వివిధ ప్రభుత్వ పథకాల ద్వారా ప్రయోజనం పొందిన లబ్ధిదారుల జాబితాను సిద్ధం చేసి గ్రామసభల్లో బహిరంగంగా చదివి వినిపించాలని ఎంపీడీవోలకు సూచించారు. వీటికి సంబంధించిన మండల, జిల్లా స్థాయి నివేదికలను సిద్ధం చేయాలన్నారు.

**ఎండలు ముదురుతున్నాయి.. అప్రమత్తత అవసరం**

వేసవి దృష్ట్యా జిల్లాలో నీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. గ్రామ పంచాయతీ కార్యదర్శులతో తక్షణమే సమీక్ష నిర్వహించి, తాగునీటి సమస్య ఉన్న ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసుకోవాలన్నారు. అలాగే రాబోయే జనగణన ప్రక్రియ కోసం ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్ల నియామకం ఇండ్ల జాబితా తయారీపై దృష్టి సారించాలని సూచించారు.

**'సూర్య ఘర్'తో విద్యుత్ ఆదా..**

'ప్రధానమంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజిలి యోజన' పథకంపై ప్రజల్లో అవగాహన కల్పించాలని కలెక్టర్ కోరారు. ఇంటిపై సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేసుకోవడం ద్వారా ఉచిత విద్యుత్‌తో పాటు అదనపు ఆదాయం పొందే అవకాశం ఉంటుందని వివరించారు. ఆసక్తి గల లబ్ధిదారులు ఏప్రిల్ 2న జరిగే గ్రామసభల్లో తమ పేర్లను నమోదు చేసుకునేలా ప్రోత్సహించాలన్నారు.ఈ సమావేశంలో గృహ నిర్మాణ శాఖ పీడీ రాజ్ కుమార్, డీపీఓ శంకర్ నాయక్, పంచాయతీరాజ్ ఈఈ గిరిధర్ తదితరులు పాల్గొన్నారు.

### సంక్షేమ పథకాలకు బడ్జెట్‌లో
# నిధులు కేటాయించాలి

- మహాలక్ష్మి పథకం, పెన్షన్ల పెంపు అమలు చేయాలి
- అర్హులకు కొత్త పెన్షన్లను మంజూరు చేయాలి
- 16వ డివిజన్ కార్పొరేటర్ మునిగడప పద్మ విజ్ఞప్తి



**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** జరుగుతున్న అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో మహాలక్ష్మి పథకం, కొత్త పెన్షన్లతో పాటు పెంచుతామనుకున్న సామాజిక పెన్షన్లకు ఈ బడ్జెట్ సమావేశంలో నిధులు కేటాయించి ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ప్రజా ప్రభుత్వ నిలబెట్టుకోవాలని 16వ డివిజన్ కార్పొరేటర్ సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యురాలు మునిగడప పద్మ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం జరిగిన మహిళ సమావేశంలో ఆమె మాట్లాడుతూ గత ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలకు ఇసికి వేసారిన తెలంగాణ రాష్ట్ర ప్రజలు ఆరోజు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను నమ్మి ప్రజలు ప్రజా ప్రభుత్వాన్ని ఎన్నుకున్నారని ఆమె అన్నారు. ముఖ్యమంత్రి అధికారం చేపట్టిన రోజు సామాజిక పెన్షన్లు నాలుగు వేలకు పెంచుతున్నామని మొట్టమొదటి సంతకం పెట్టి రెండున్నర సంవత్సరాలు గడిచిన పెంచిన పెన్షన్లు అందక వృద్ధులు వికలాంగులు ఒంటరి మహిళలు మానసిక వేదన గురవుతున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే ప్రతి ఇంటి మహిళకి మహా లక్ష్మీ పథకం కింద రూ.2,500 అకౌంట్ లో వేస్తామన్న ఇచ్చిన హామీ నీటి రాత గానే మిగిలిపోయిందని అన్నారు. గత ఏడు సంవత్సరాల నుండి భర్త చనిపోయి ఆర్థికంగా చితికిపోయినా వితంతువులకి, వికలాంగులకు, వృద్ధులకు కొత్త పెన్షన్లు మంజూరు కాక కొత్త పెన్షన్లు వస్తాయి అన్న ఆశతో వారు జీవిస్తున్నారని అన్నారు. తక్షణమే తెలంగాణ రాష్ట్ర ప్రజా ప్రభుత్వం నేడు జరుగుతున్న అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ప్రజలకు ఇచ్చిన ఈ హామీలకు నిధులు కేటాయించి ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి ఆమె విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో మార్తమ్మ, ఎస్కే ఫర్జానా, ఎస్కే కుషీద్, బేబీ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణిలో నల్లబ్యాడ్జీలతో నిరసన

- సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన ఉధృతం చేస్తాం
- మిర్యాల రంగయ్య
- అధికారులకు వినతి పత్రం అందించిన గుర్తింపు సంఘం
- కార్యాచరణ వాల్ పోస్టర్ విడుదల



**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** సింగరేణిలో కార్మిక సమస్యల పరిష్కారాన్ని కోరుతూ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(ఏఐటియూసి) గుర్తింపు సంఘం ఆధ్వర్యంలో మంగళవారం కార్పొరేట్ ఏరియాలోని అన్ని డిపార్ట్మెంట్లలో నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(ఏఐటియూసి) అదనపు ప్రధాన కార్యదర్శి మిర్యాల రంగయ్య మాట్లాడుతూ సింగరేణి కార్మికుల సమస్యలు పరిష్కరించకుండా యాజమాన్యం కాలయాపన చేస్తోందన్నారు. సమస్యల పరిష్కారాన్ని కోరుతూ ఆందోళన కార్యక్రమాలకు పిలుపిచ్చినట్లు చెప్పారు. కొన్ని సమస్యలను యాజమాన్యం స్ట్రక్చర్ సమావేశాల్లో అంగీకరించినప్పటికీ ఇంత వరకు వాటి అమలుకు సర్క్యులర్ జారీ చేయకపోవడం ఆశ్చర్యంగా ఉందన్నారు. ప్రధానంగా మారుపేర్లు, విజిలెన్స్ కేసుల సమస్య, సొంత ఇంటి పథకం, పెర్క్స్ పై ఇన్కం టాక్స్ సమస్య, డిస్మిస్ కార్మికులకు అవకాశం కల్పించాలని కోరారు. యాజమాన్యం సమస్యలను పరిష్కరించకుండా నిర్లక్ష్యం చేస్తోందని అన్నారు. భవిష్యత్ కార్యాచరణపై వాల్పోస్టర్ విడుదల చేశారు. ఈనెల 18 నుండి 30 వరకు గోలేటి నుండి కొత్తగూడెం వరకు బస్ జాతా ప్రారంభం అవుతుందని, 30న సింగరేణి ప్రధాన కార్యాలయం ఎదుట భారీ ధర్నా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సింగరేణి వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలను, ఏప్రిల్లో జరిగే సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జరగబోయే ఆందోళన కార్యక్రమాల్లో కార్మికులు అంధిక సంఖ్యలో పాల్గొని సంస్థ మనుగడ కోసం పాటుపడాలని కోరారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ కార్యదర్శి రమణమూర్తి, ఉపాధ్యక్షులు క్రిస్టోఫర్, సహాయ కార్యదర్శి రాము, పిట్ కార్యదర్శులు నరేష్, సుధీర్, అనంత లక్ష్మీ, సూర్యప్రభ, జీవి రమేష్, శ్యాం, శ్రీనివాస్, నాయకులు ప్రశాంత్, నాగయ్య, సరిత, ప్రవీణ్, వేమనాచారి, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## 108 సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం చేయొద్దు

**డివిజన్ కోఆర్డినేటర్ మోహన్**



**మహా దుమ్ముగూడెం:** అత్యవసర వైద్య సేవలు అందించే 108,102,1962 వాహనాలను భద్రాచలం డివిజన్ కోఆర్డినేటర్ మోహన్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ.. సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం చేయరాదని ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. అమ్మ ఒడి వాహనాలను గర్భిణుల వైద్య సేవలు, ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవం అయిన తర్వాత తల్లీబిడ్డను ఇంటికి చేర్చడానికి ఖర్చు లేకుండా 102, 108 వాహనాలు ఇళ్ల దగ్గరకు వచ్చి తీసుకెళ్తున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఈఎంటి వెంకట్, పైలెట్స్ కళ్యాణ్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులకు శంకుస్థాపన



**మహా దుమ్ముగూడెం:** మండలంలోని పర్ణశాల గ్రామపంచాయతీ పరిధిలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు సర్పంచ్ వాగే ఖాదర్ బాబు శంకుస్థాపన కార్యక్రమాలు మంగళవారం చేపట్టారు.శ్రీరామనవమి కళ్యాణ పురస్కరించుకుని భక్తులకు పర్ణశాల గ్రామస్తులకు నీటి సమస్య తలెత్తకుండా ఉండేందుకు 8.50 లక్షలు వ్యయంతో పైప్లైన్ పనులను పంచాయతీలో పరిధిలోని గ్రామాలలో నీటి ఎద్దడి కొరకు చేతిపంపు నిర్మాణ పనులను చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. ప్రముఖ పుణ్యక్షేత్రం పర్ణశాలకు వేలాది మంది భక్తులు అనేక ప్రాంతం నుండి వస్తున్నందున నీటి సమస్య తలెత్తకుండా గ్రామపంచాయతీ నిధులు కేటాయించి త్రాగునీటి ఏర్పాట్లు చేపడుతున్నట్లు గ్రామాలు నీటి సమస్య తీర్చేందుకు పనులు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ వాగే శ్రీధర్ వార్డు సభ్యులు సిహెచ్ మిత్ర ముత్యాలక్క కవిత సమ్మక్క తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన



**మహా దుమ్ముగూడెం:** మండల పరిధిలోని పెద్ద నల్లబల్లి రైతు వేదిక వద్ద ఐటీసీ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం జిల్లా అగ్రికల్చర్ అధికారి బాబురావు ఆధ్వర్యంలో నిర్వహించారు. మండలంలోని ప్రకృతి వ్యవసాయంలో సెలెక్ట్ అయినటువంటి చింతగుప్ప కమలాపురం గ్రామాలకు చెందిన రైతులకు మిషన్ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా అగ్రికల్చర్ అధికారి మాట్లాడుతూ..ప్రకృతి సిద్ధమైన వ్యవసాయ పద్ధతుల ద్వారా భూసారాన్ని కాపాడుకుంటూ స్థిరమైన దిగుబడులు సాధించవచ్చని తెలిపారు.మోతాదుల ఎరువుల వాడకం, భూసార పరీక్షలపై రైతులు భూసార పరీక్షలు తప్పనిసరిగా చేసుకోవాలన్నారు. సేంద్రియ వ్యవసాయం చేసే రైతులకు ప్రభుత్వం తరఫున సలహాలు, సూచనలు, సహాయ సహకారాలు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి నవీన్ కుమార్ సర్పంచ్ గట్టుపల్లి పార్వతి ఐటీసీ కోఆర్డినేటర్ షణ్ముఖ సాయి పర్ణశాల ఏఈఓ తదితరులు పాల్గొన్నారు.

## 37వ డివిజన్‌లో పారిశుద్ధ్యం మెరుగుపరచాలి

- కొత్త డ్రైనేజీల నిర్మాణం చేపట్టాలి
- పాడైన రోడ్లకు మరమ్మతులు చేపట్టాలి
- ఎండాకాలం దృష్ట్యా నీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టాలి
- కమిషనర్ కు కార్పొరేటర్ మల్లెల స్వప్నకుమారి విజ్ఞప్తి



**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** కొత్తగూడెం పాల్వంచ కార్పొరేషన్ పరిధిలోని పాల్వంచ 37వ డివిజన్ లో పారిశుద్ధ్యమును మెరుగుపరచాలని కొత్త డ్రైనేజీల నిర్మాణం చేపట్టాలని పాడైన రోడ్లకు మరమ్మతులు చేయాలని ఎండాకాలం దృష్ట్యా నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం మున్సిపల్ కమిషనర్ సుజాతను పాల్వంచ 37వ డివిజన్ కార్పొరేటర్ మల్లెల స్వప్న కుమారి మర్యాదపూర్వకంగా కలిసి సమస్యలపై వినతిపత్రం అందించి పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. తన డివిజన్ పరిధిలో నెలకొన్న పలు ప్రజా సమస్యలపై కమిషనర్ తో స్వప్నకుమారి సుదీర్ఘంగా చర్చించారు. డివిజన్‌లో ప్రజలకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. పారిశుధ్య నిర్వహణను మెరుగుపరచాలని ప్రజలకు తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు.కొత్త డ్రైనేజీల నిర్మాణం పాడైన రోడ్ల మరమ్మత్తు పనులను త్వరితగతిన ప్రారంభించాలని విన్నవించారు. కార్పొరేటర్ విన్నపాలపై కమిషనర్ సుజాత సానుకూలంగా స్పందించారు. డివిజన్ సమస్యలను పరిష్కరించి అభివృద్ధి పనులను వేగవంతం చేస్తామని హామీ ఇచ్చారు.

## కే దుమ్ముగూడెం గ్రామంలో కిడ్నీ బాధితుల హెల్త్ క్యాంప్




**మహా దుమ్ముగూడెం:** మండల పరిధిలోని నరసాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని కే దుమ్ముగూడెం గ్రామంలో కిడ్నీ వ్యాధి ఉన్న బాధితులకు మంగళవారం హెల్త్ క్యాంపు నిర్వహించారు. ఈ హెల్త్ క్యాంపులో రోగులు పరీక్షించి చికిత్స తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. సందర్భంగా డాక్టర్ సుభాష్ రోగులకు తెలుపుతూ.. వ్యాధిగ్రస్తులు దీర్ఘకాలం మందులు వాడరాదని మద్యపానం ధూమపాదం అలవాటు ఉంటే దూరంగా ఉండాలని వ్యాధులకు సంబంధించిన చికిత్స క్రమంగా తీసుకోవాలని నిర్లక్ష్యం చేయరాదని సూచించారు. గ్రామంలోని 30 మంది రోగులకు పరీక్షించి 17 మందికి రక్త పరీక్ష చేసి మందులను అందించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సర్పంచ్ సెక్రెటరీ ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఆహార శుభ్రతపై శిక్షణ



**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో మంగళవారం పాల్వంచలోని డిప్యూటీ డీఎంహెచ్ఓ కార్యాలయం సమావేశ మందిరంలో ఆహార భద్రత పరిశుభ్రత ప్రమాణాలపై వీధి ఆహార విక్రేతలు, రెస్టారెంట్ యజమానులు వంటకారులకు అవగాహన కల్పించే ఉద్దేశంతో ఓరియెంటేషన్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి జిల్లా వైద్య ఆరోగ్య అధికారి తుకారాం రాథోడ్ హాజరై ఆహార భద్రత పరిశుభ్రత పాటించడం ప్రజారోగ్య పరిరక్షణలో ఎంతో ముఖ్యమని తెలిపారు. ఆహార పదార్థాలను శుభ్రంగా తయారు చేయడం వంట ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచడం తాగునీటిని శుద్ధిగా వినియోగించడం ఆహార పదార్థాలను సరైన విధంగా నిల్వ చేయడం ఆహార తయారీలో పాల్గొనే వారి వ్యక్తిగత పరిశుభ్రతను పాటించడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి శరత్, తెలంగాణ రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ అండ్ హైజీన్ ట్రైనర్ నందిని పాల్గొని ఆహార భద్రతా ప్రమాణాలు పరిశుభ్రత చర్యలు ఆహార కలుషితాన్ని నివారించే విధానాలపై వివరంగా శిక్షణ అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని రెస్టారెంట్ యజమానులు, వంటకారులు, వీధి ఆహార విక్రేతలు పాల్గొని శిక్షణ పొందారు. ప్రజలకు సురక్షితమైన పరిశుభ్రమైన ఆహారం అందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని అధికారులు తెలిపారు.

## ఉపాధి పథకాన్ని పాత పద్ధతిలోనే కొనసాగించాలి

వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి మర్మం చంద్రయ్య డిమాండ్



**మహా దుమ్ముగూడెం:** ఉపాధి హామీ పథకాన్ని పాత పద్ధతిలోనే కొనసాగించాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి మర్మం చంద్రయ్య డిమాండ్ చేశారు. మంగళవారం మండల పరిధిలోని బట్టిగూడెం గ్రామంలో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో 100 డేస్ కూలీల సమస్యలను అడిగి తెలుసుకుని ఆయన మాట్లాడుతూ..కేంద్ర ప్రభుత్వం గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని రద్దుచేసి దాని స్థానంలో వీబీజీ రాంజీ పథకాన్ని తీసుకువచ్చి పేదలను ఇబ్బందులకు గురి చేస్తుందని ఆరోపించారు. కూలీలకు పనులు ప్రారంభించే ముందు ఒక ఫోటో పనులు పూర్తయిన తర్వాత మరో ఫోటో తీయాలనే నిబంధనను తొలగించాలని డిమాండ్ చేశారు. పని ప్రదేశంలో టెంట్ తాగునీరు మౌలిక సౌకర్యాలు కల్పించాలని, కూలీలకు రోజుకు 600 లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు మడకం మహేంద్రనాథ్ లక్ష్మయ్య జలకం కృష్ణ రాజబాబు సీతమ్మ ముత్యలక్క శాంతమ్మ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధి వేగవంతం చేయాలి

**డీఆర్‌డీఓ విద్యా చందన**



**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా చేపట్టిన 99 రోజుల కార్యాచరణలో ములకలపల్లి మండలం పాతగంగారం గ్రామ పంచాయతీ పరిధిలోని జగన్నాధపురం గ్రామాన్ని మంగళవారం జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి విద్యా చందన సందర్శించి పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా గ్రామంలో డ్రైన్‌లు సోక్‌పిట్‌ల నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టి వాటి పురోగతిని సమీక్షించారు. గ్రామాల్లో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచడం వర్షపు నీటి నిల్వలను నివారించడం ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కల్పించడం కోసం ఈ పనులు అత్యంత కీలకమని ఆమె అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధిని వేగవంతం చేయాల్సిన అవసరం ఉందని సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేసి పనులను నిర్దిష్ట గడువులో పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం జగన్నాధపురం గ్రామ పంచాయతీ పరిధిలోని ఎన్‌పీఏ కలిగిన స్వయం సహాయక సంఘాల సభ్యులతో సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సంఘాల ఆర్థిక పరిస్థితులను సమీక్షించి రుణాల సక్రమ వినియోగం ఆదాయ వృద్ధి మార్గాలు ప్రభుత్వ పథకాల సమర్థ వినియోగంపై సభ్యులకు మార్గదర్శకాలు అందించారు. స్వయం సహాయక సంఘాలు మహిళల ఆర్థిక సాధికారతకు బలమైన వేదికలని ప్రతి సభ్యురాలు బాధ్యతతో వ్యవహరించి సంఘాలను బలోపేతం చేయాలని డీఆర్‌డీఓ విద్యా చందన సూచించారు. గ్రామాభివృద్ధిలో మహిళల పాత్ర అత్యంత కీలకమని ఆమె తెలిపారు. గ్రామాల్లో మౌలిక వసతుల అభివృద్ధి పారిశుద్ధ్య పరిరక్షణ మహిళల ఆర్థిక సాధికారత వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తూ ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు గ్రామపంచాయతీ ప్రతినిధులు స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

EDITORIAL సంపాదకీయం

# ట్రంప్‌కు ఎదురుదెబ్బలు

అగ్రరాజ్యం అమెరికాలో డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వానికి ఊహించని భారీ ఎదురుదెబ్బ లు తగులుతున్నాయి. లక్ష్యం లేని యుద్ధంపై ఇంటాబయట విమర్శల జడివాడ కురుస్తోంది. ట్రంప్ రెండో దఫా పాలనలో అత్యంత కీలకమైన పదవిలో ఉన్న యూఎస్ నేషనల్ కౌంటర్ టెర్రరిజం సెంటర్ (ఎన్‌సీటీసీ) డైరెక్టర్, టాప్ ఇంటెలిజెన్స్ అధికారుల్లో ఒకరైన జో కెంట్ తన పదవికి సంచలన రాజీనామా చేశారు. ఫిబ్రవరి చివర్లో ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా ప్రారంభించిన దాడులను తీవ్రంగా వ్యతిరేకిస్తూ ఆయన ఈ నిర్ణయం తీసుకోవడం పరిస్థితికి అద్దం పడుతోంది. తన రాజీనామా ద్వారా ట్రంప్ ప్రభుత్వ విదేశాంగ విధానాలపై, ముఖ్యంగా ఇజ్రాయెల్ ఒత్తిడికి తలొగ్గి యుద్ధానికి దిగడంపై ఆయన తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఇరాన్ యుద్ధం మొదలైన తర్వాత ట్రంప్ యంత్రాంగం నుంచి బయటకు వచ్చిన అత్యున్నత స్థాయి అధికారి కెంట్ కావడం గమనార్హం. జో కెంట్ తన రాజీనామా లేఖను సోషల్ మీడియా వేదికగా పంచుకుంటూ, ప్రస్తుత పరిస్థితుల్లో తన మనస్సాక్షికి విరుద్ధంగా ఇరాన్‌పై జరుగుతున్న యుద్ధాన్ని ఎంతమాత్రం సమర్థించలేనని కుండబద్దలు కొట్టారు. అమెరికా జాతీయ భద్రతకు ఇరాన్ నుంచి తక్షణ ముప్పు ఏదీ లేదని, కేవలం ఇజ్రాయెల్, అమెరికాలోని శక్తిమంతమైన ఇజ్రాయెల్ అనుకూల లాబీయింగ్ వర్గాల ఒత్తిడి కారణంగానే అమెరికా ఈ యుద్ధాన్ని ప్రారంభించిందని ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు. 'అమెరికా ఫస్ట్' (ముందు అమెరికా) అనే నినాదంతో అధికారంలోకి వచ్చిన ట్రంప్, ఇప్పుడు ఆ విధానానికి పూర్తిగా విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని కెంట్ విమర్శించారు. గతంలో మధ్యప్రాచ్య దేశాల్లోని యుద్ధాలను అమెరికా సంపదను, దేశభక్తుల ప్రాణాలను హరించే ఉచ్చుగా పరిగణించిన ట్రంప్.. ఇప్పుడు అదే ఊబిలోకి దిగడం పట్ల కెంట్ ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతస్థాయి ఇజ్రాయెల్ అధికారులు మరియు అమెరికా మీడియా కలిసి ఒక తప్పుడు ప్రచారంతో ట్రంప్ ప్రభుత్వాన్ని తప్పుదోవ పట్టించాయని ఆయన స్పష్టం చేశారు. కాగా జో కెంట్ కేవలం ఒక సాధారణ రాజకీయ నియామకం ద్వారా వచ్చిన అధికారి కారు. ఆయనకు సైన్యంలో మరియు ఇంటెలిజెన్స్ విభాగంలో దశాబ్దాల సుదీర్ఘమైన, విశేషమైన అనుభవం ఉంది. ఆయన అమెరికా స్పెషల్ ఫోర్సెస్ (గ్రీన్ బెరెట్)లో పనిచేశారు, అలాగే సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ (సీఐఏ)లో విశేష సేవలందించారు. తన కెరీర్‌లో ఏకంగా 11 సార్లు యుద్ధ రంగాల్లో విధులు నిర్వర్తించారు. జాతీయ భద్రత, ఉగ్రవాద నిర్మూలన వ్యూహాల్లో ఆయనది అందెవేసిన చేయి. ఇంతటి క్షేత్రస్థాయి అనుభవం ఉన్న వ్యక్తి, జాతీయ భద్రతా వ్యవహారాలకు గుండెకాయ లాంటి నేషనల్ కౌంటర్ టెర్రరిజం సెంటర్‌కు డైరెక్టర్‌గా ఉండి, ఏకంగా అధ్యక్షుడి నిర్ణయాన్నే తప్పుబడుతూ బయటకు రావడం సంచలనంగా మారింది. అంతేకాకుండా, కెంట్ జీవితంలో ఒక అతిపెద్ద వ్యక్తిగత విషాదం కూడా ఉంది. ఆయన భార్య షానన్ కెంట్, అమెరికా నావీలో క్రిప్టోలాజిక్ టెక్నీషియన్‌గా పనిచేస్తూ, 2019లో సిరియాలో జరిగిన ఒక ఆత్మాహుతి దాడిలో వీరమరణం పొందారు. విదేశీ గడ్డపై అనవసరమైన యుద్ధాల వల్ల అమెరికా సైనికులు ప్రాణాలు కోల్పోకూడదనే కెంట్ బలమైన వాదనకు, ఆయన వ్యక్తిగత విషాదం మరింత భావోద్వేగమైన నేపథ్యాన్ని ఇస్తోంది.





### జో కెంట్ రాజీనామా పరిణామాలు

జో కెంట్ రాజీనామా కేవలం ఒక అధికారి నిష్క్రమణ మాత్రమే కాదు, ట్రంప్ ప్రభుత్వ అంతర్గత విధానాల్లో ఉన్న తీవ్ర విభేదాలకు ఇది అద్దం పడుతోంది. డైరెక్టర్ ఆఫ్ నేషనల్ ఇంటెలిజెన్స్ (డీఎన్ఐ) తులసీ గబ్బార్డ్ నేతృత్వంలో పనిచేస్తున్న కెంట్.. ఈ విధంగా బాహాటంగా రాజీనామా చేయడం అమెరికా ఇంటెలిజెన్స్ వర్గాల్లో కలకలం రేపుతోంది. ఇరాన్‌పై దాడులు ప్రారంభించిన తర్వాత డొనాల్డ్ ట్రంప్ అంతర్గతంగానే కాకుండా అంతర్జాతీయంగా కూడా విమర్శలు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా, తన ఎన్నికల ప్రచారంలో "యుద్ధాలను ఆపుతాను, కొత్త యుద్ధాలను ప్రారంభించను" అని హామీ ఇచ్చిన ట్రంప్, ఇప్పుడు ఇజ్రాయెల్ ప్రోద్బలంతో ఇరాన్‌తో యుద్ధానికి దిగడం ఆయన మద్దతుదారుల్లోనే గందరగోళాన్ని సృష్టిస్తోంది. ఈ నేపథ్యంలో ఉగ్రవాద బెదిరింపులను విశ్లేషించే బాధ్యత ఉన్న ఒక అత్యున్నత స్థాయి అధికారి, ఇరాన్ వల్ల అమెరికాకు ఎలాంటి ముప్పు లేదని బహిరంగంగా ప్రకటించడం కాంగ్రెస్ ప్రతిపక్షాలకు ఒక పెద్ద ఆయుధంగా మారింది. ఈ పరిణామం రాబోయే రోజుల్లో ట్రంప్ యంత్రాంగంపై విమర్శల దాడికి దారి తీసే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది. మొత్తం మీద, జో కెంట్ రాజీనామా అమెరికా రాజకీయాల్లో, ముఖ్యంగా రక్షణ, విదేశాంగ విధానాల్లో ఒక పెద్ద కుదుపుగా విశ్లేషకులు భావిస్తున్నారు. ఒక పక్క ఇరాన్‌తో ముదురుతున్న యుద్ధ పరిస్థితులు, మరోపక్క సొంత ఇంటెలిజెన్స్ అధికారుల నుంచే వ్యక్తమవుతున్న తీవ్ర అసమ్మతి ట్రంప్ ప్రభుత్వానికి కత్తిమీద సాములా మారాయి. అమెరికా ప్రయోజనాల కంటే ఇజ్రాయెల్ ప్రయోజనాలకే పెద్దపీట వేస్తున్నారన్న కెంట్ ఆరోపణలను వైట్ హౌస్ ఎలా తిప్పికొడుతుందో, అలాగే రాబోయే రోజుల్లో జరిగే కాంగ్రెస్ ఇంటెలిజెన్స్ విచారణల్లో ఈ అంశం ఎలాంటి ప్రకంపనలు సృష్టిస్తుందో వేచి చూడాలి.

## గణాంకాల సాక్షిగా అన్నదాతకు అభయం

### ఆచరణలో పారదర్శక నవశకం



(గడల నరసింహారావు,
సీనియర్ జర్నలిస్ట్ , ఖమ్మం)

రాజకీయాల్లో హామీలు గుప్పించడం సులువే కానీ, అధికార పగ్గాలు చేపట్టిన తర్వాత నెర్రెలు బారిన ఆర్థిక వ్యవస్థను చక్కదిద్దుకుంటూ ఆ హామీలను ఆచరణలో పెట్టడమే అసలైన నాయకత్వ లక్షణం. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'రైతు భరోసా' పథకం సరిగ్గా ఇలాంటి ఒక చారిత్రక పరిణామ క్రమానికే దర్పణం పడుతోంది. ఎకరానికి ఏటా రూ. 15,000 ఇస్తామన్న ఎన్నికల వాగ్దానాన్ని నిలబెట్టుకునే క్రమంలో, ఖజానాలో నిధుల లేమి, గత పాలకుల నుంచి వారసత్వంగా సంక్రమించిన గుదిబండ లాంటి అప్పుల భారంతో ఒకవైపు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ ఉక్కిరిబిక్కిరి అవుతున్నప్పటికీ.. రైతన్నకు ఇచ్చిన మాటకు కట్టుబడి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వేస్తున్న అడుగులు ఆయన రాజకీయ చిత్తశుద్ధికి నిదర్శనంగా నిలుస్తున్నాయి.

ప్రస్తుత యాసంగి సీజన్‌కు సంబంధించి అక్షరాలా రూ. 9,000 కోట్ల భారీ నిధులను రైతాంగానికి అందించడం ఏ ప్రభుత్వానికైనా ఒక అతిపెద్ద ఆర్థిక సవాలే. అయితే, ఈ బృహత్తర వ్యయాన్ని ఒకేసారి కాకుండా మూడు విడతల్లో పంపిణీ చేయాలని తీసుకున్న నిర్ణయాన్ని.. కేవలం నిధుల సర్దుబాటు చర్యగా మాత్రమే చూడలేము. ఇది ఒక పకడ్బందీ ఆర్థిక క్రమశిక్షణకు సంకేతం. గణాంకాలను పరిశీలిస్తే ప్రభుత్వ పక్కా ప్రణాళిక అర్థమవుతుంది. మార్చి 22వ తేదీన తొలి విడత కింద ఏకంగా 70 లక్షల మంది చిన్న, సన్నకారు రైతుల ఖాతాల్లో రూ. 3,590 కోట్ల రూపాయలను నేరుగా జమ చేయడం ద్వారా ప్రభుత్వం తన ప్రాధాన్యతలను స్పష్టం చేసింది. పెట్టుబడి సాయం కోసం ప్రైవేటు వడ్డీ వ్యాపారుల వద్ద అప్పుల పాలయ్యే అట్టడుగు వర్గాల వ్యవసాయదారులకు సరైన సమయంలో ఈ ఆర్థిక ఊతం అందడం వ్యవసాయ రంగంలో నూతన జవసత్వాలను నింపుతుంది. ఆ తర్వాత సరిగ్గా 20 రోజులకు రెండో విడత కింద రూ. 2,650 కోట్లను, మిగిలిన నిధులను ఏప్రిల్ నెలాఖరు నాటికి క్రమపద్ధతిలో విడుదల చేసే ప్రణాళిక.. మార్కెట్లో ఎరువులు, విత్తనాల కొనుగోలుకు ఒక స్థిరమైన ఆర్థిక చక్రాన్ని సృష్టిస్తుంది.

ప్రజాధనం ఏ ఒక్క రూపాయి పక్కదారి పట్టకూడదన్న ప్రభుత్వ ఉక్కుసంకల్పం ఈ పథకం లబ్ధిదారుల ఎంపికలో స్పష్టంగా గోచరిస్తోంది. గతంలో సాగుకు నోచుకోని బంజరు భూములు, కొండలు, గుట్టలు, చివరకు రియల్ ఎస్టేట్ వెంచర్లకు సైతం వేల కోట్ల రూపాయల పెట్టుబడి నిధులు ప్రవహించాయన్నది పత్రికల దర్యాప్తుల్లో వెల్లడైన జగమెరిగిన సత్యం. ఈ వ్యవస్థాగత లోపాలను సరిదిద్దే క్రమంలో, కేవలం వాస్తవంగా సాగులో ఉన్న భూములకే నిధులు అందేలా నిబంధనలను కఠినతరం చేయడం ఒక సాహసోపేతమైన చర్య. ఈ పారదర్శక విధానం వల్లే తొలి విడతలో కచ్చితమైన 70 లక్షల మంది అర్హులను జల్లెడ పట్టి ఎంపిక చేయగలిగారు. ఈ ప్రక్షాళన.. తాత్కాలికంగా విపక్షాలకు రాజకీయ విమర్శనాస్త్రాలను అందించినా, దీర్ఘకాలంలో ఇది రాష్ట్ర ఖజానాకు, వ్యవసాయ రంగానికి మేలు చేసే అత్యుత్తమ సంస్కరణే.

ఇక రాజకీయ కోణంలో విశ్లేషిస్తే.. ఈ పథకం ప్రారంభోత్సవానికి సిద్దిపేట జిల్లా నర్మెట్టను వేదికగా ఎంచుకోవడం రేవంత్ రెడ్డి రాజకీయ చతురతకు అద్దం పడుతోంది. పక్కదారి పడుతున్న నిధులను 'రాహుల్ బంధు' అంటూ కేటీఆర్ విమర్శించడం, పెంచిన నగదు ఏమైందని బీజేపీ నిలదీయడం వంటి ప్రతిపక్షాల ఆరోపణల నడుమ.. వారి కంచుకోట నుంచే వేల కోట్ల నిధుల పంపిణీకి శ్రీకారం చుట్టడం మాస్టర్ స్ట్రోక్. ఏప్రిల్ నెలాఖరు నాటికి ఈ 9,000 కోట్ల రూపాయల బృహత్తర పంపిణీ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయడం ప్రభుత్వానికి అగ్నిపరీక్షే అయినప్పటికీ, ఈ సవాలును అధిగమిస్తే ముఖ్యమంత్రి నాయకత్వంపై రైతాంగానికి ఉన్న విశ్వాసం రెట్టింపు అవుతుంది. నిరుపేద రైతన్నల పక్షపాతిగా కాంగ్రెస్ సర్కార్ తన ముద్రను సుస్థిరం చేసుకునే దిశగా సాగుతున్న ఈ ప్రయాణం.. తెలంగాణ వ్యవసాయ, రాజకీయ ముఖచిత్రంపై ఒక సువర్ణాధ్యాయంగా మిగిలిపోతుందనడంలో ఎలాంటి సందేహం లేదు.

రచనలకు ఆహ్వానం
ప్రతీరోజు ప్రచురితమయ్యే ఎడిట్ పేజీకి దేశ, రాష్ట్ర రాజకీయాలు, అంతర్జాతీయ పరిణామాలు, ప్రభుత్వాల తీరుతెన్నులు, వివిధ రంగాలపై విశ్లేషణలు, వ్యాసాలు, తాజా అంశాలపై అభిప్రాయాలు పంపండి.
మీ రచనలు పంపాల్సిన చిరునామా:
mahaapatrika@gmail.com
whatsapp: 74369 39999



## సారా టెండూల్కర్ బ్యూటీ సీక్రెట్స్

టీమ్ ఇండియా గ్రేట్ సచిన్ టెండూల్కర్ కుమార్తె సారా టెండూల్కర్.. కేవలం సెలబ్రిటీగానే కాకుండా తనదైన ఫ్యాషన్ సెన్స్‌తో సోషల్ మీడియాలో ఎప్పుడూ ట్రెండింగ్‌లో ఉంటారు. ఇటీవల తన తమ్ముడు అర్జున్ టెండూల్కర్ వివాహ వేడుకల్లో సారా కనిపించిన తీరు బ్యూటీ ప్రియులను అమితంగా ఆకట్టుకుంది. తక్కువ మేకప్‌తోనే ఎంతో సహజంగా, మెరిసిపోతూ కనిపించిన సారా.. తన అందం వెనుక ఉన్న అసలు రహస్యాలను తాజాగా ఒక ఇంటర్వ్యూలో పంచుకున్నారు. తన బ్యూటీ ఫిలాసఫీ గురించి సారా మాట్లాడుతూ.. "ఎప్పుడూ తక్కువ మేకప్‌తో సహజంగా కనిపించడానికే (Less is more) నేను ప్రాధాన్యత ఇస్తాను" అని పేర్కొన్నారు. ముఖ్యంగా ఆయిలీ మరియు మొటిమలు వచ్చే గుణం ఉన్న తన చర్మాన్ని ఆమె ఎలా కాపాడుకుంటారో వివరించారు.

**ఎంత ఆలస్యమైనా ఆ ఒక్కటి మాత్రం మిస్ చేయరు**

చాలామంది మేకప్ వేసుకునేటప్పుడు రకరకాల ఫౌండేషన్లు, కన్సీలర్లపై దృష్టి పెడతారు. కానీ సారా టెండూల్కర్ మాత్రం వీటన్నింటికంటే ముందు ఒక ముఖ్యమైన పని చేస్తారట. "నేను ఎంత ఆలస్యంగా బయలుదేరినా, ఎంత హడావిడిగా ఉన్నా సరే.. మేకప్‌కు ముందు నా చర్మాన్ని సిద్ధం చేయడం (Skin Prepping) అస్సలు మర్చిపోను. మేకప్ వేసుకునే ముందు ఖచ్చితంగా లోషన్ లేదా మాయిశ్చరైజర్ రాస్తాను. చర్మం హైడ్రేటెడ్‌గా ఉంటేనే మేకప్ సహజంగా కనిపిస్తుంది" అని సారా వివరించారు.

**సారా మోస్ట్ ఫేవరెట్ ప్రొడక్ట్ ఇదే..**

సాధారణంగా మేకప్ అంటే గంటల తరబడి సమయం పడుతుందని అందరూ భావిస్తారు. కానీ సారా మాత్రం కేవలం కొద్ది నిమిషాల్లోనే సిద్ధమైపోతారట. ఆమెకు అత్యంత ఇష్టమైన, ఎప్పుడూ వాడే ప్రొడక్ట్ 'టింటెడ్ సన్‌స్క్రీన్' (Tinted Sunscreen). బయటకు వెళ్లేటప్పుడు కేవలం టింటెడ్ సన్‌స్క్రీన్ రాసుకుంటే చర్మం తాజాగా కనిపిస్తుందని ఆమె చెబుతారు. ఇక ఇన్‌స్టంట్‌గా లుక్ మారాలంటే కొంచెం బ్లష్ (Blush), లిప్ బామ్ లేదా లిప్ గ్లాస్ ఉంటే సరిపోతుందని ఆమె సలహా ఇస్తున్నారు.

**మొటిమలు ఉన్నవారు చేసే తప్పు అదే**

మొటిమలు లేదా సెన్సిటివ్ స్కిన్ ఉన్నవారు వాటిని కవర్ చేయడానికి ఎక్కువ లేయర్ల మేకప్ వేస్తుంటారు. కానీ ఇది చర్మానికి మరింత హాని చేస్తుందని సారా హెచ్చరించారు. "నా చర్మం కూడా మొటిమలకు గురయ్యే స్వభావం కలదే. అందుకే నేను చర్మాన్ని మేకప్‌తో ఉక్కిరిబిక్కిరి చేయను. స్కిన్ కేర్ రొటీన్ సరిగ్గా ఉంటే, చర్మం ఆరోగ్యంగా ఉంటుంది. అప్పుడు మేకప్‌తో కవర్ చేయాల్సిన అవసరమే రాదు" అని సారా తన అనుభవాన్ని పంచుకున్నారు. ప్రస్తుతం సారా టెండూల్కర్ ఒక ప్రముఖ స్కిన్ కేర్ బ్రాండ్ (Cetaphil) ప్రచారకర్తగా కూడా వ్యవహరిస్తున్నారు. ఆమె చెప్పే సూత్రం ఒక్కటే.. మేకప్ కంటే ముందు మన చర్మాన్ని ప్రేమించడం నేర్చుకోవాలి.

**తరచుగా అడిగే ప్రశ్నలు**

**1. సారా టెండూల్కర్ స్కిన్ టైప్ ఏమిటి?**

సారాది ఆయిలీ, అక్నే ప్రోన్ (మొటిమలు వచ్చే అవకాశం ఉన్న) చర్మం. అందుకే ఆమె చాలా జాగ్రత్తగా స్కిన్ కేర్ ప్రొడక్ట్స్ ఎంచుకుంటారు.

**2. తక్కువ సమయంలో రెడీ అవ్వడానికి సారా ఇచ్చే టిప్ ఏమిటి?**

స్కిన్ ప్రిప్పింగ్ తర్వాత కేవలం టింటెడ్ సన్‌స్క్రీన్, కొంచెం బ్లష్, లిప్ గ్లాస్ వాడటం వల్ల తక్షణమే ఫ్రెష్ లుక్ వస్తుందని ఆమె చెబుతారు.

**3. మేకప్ ఎక్కువ సేపు ఉండాలంటే ఏం చేయాలి?**

చర్మం బాగా హైడ్రేటెడ్‌గా ఉండాలి. మంచి మాయిశ్చరైజర్ వాడితే మేకప్ చర్మంపై ప్యాచీగా రాకుండా ఎక్కువ సేపు సహజంగా ఉంటుంది.

# ముస్లిం మైనారిటీలకు రంజాన్ తోఫా



**మందమర్రి, మహా :** మందమర్రి రెండవ జోన్ లో 'మదీనా మసీదు'లో మంగళవారం ముస్లిం మైనారిటీ లకు కాంగ్రెస్ పార్టీ నేతలు సొత్కు సుదర్శన్, ఆకారం రమేష్, మహమ్మద్ షరీఫ్ లు రంజాన్ తోఫా అంద జేశారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ పేద ముస్లిం, మైనారిటీలకు రంజాన్ పండుగను ఎలాంటి ఆటంకాలు లేకుండా జరుపుకునేందుకు ప్రభుత్వం సాయం చేయడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ముస్లిం పెద్దలు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# హుజూర్ నగర్ 19 వ వార్డ్ లో బ్యాడ్మింటన్ కోర్టు ప్రారంభం

**బ్యాడ్మింటన్ కోర్టు ఆవరణలోనే ఇఫ్తార్ విందు ఏర్పాటు**



**హుజూర్ నగర్ మహా:** హుజూర్ నగర్ పట్టణంలోని 19వ వార్డులో వివియం స్కూల్ పక్కన మంగళవారం బ్యాడ్మింటన్ కోర్టు ను కౌన్సిలర్ వల్లపు దాస్ కృష్ణ శాఖమూరి రవి,పొనుగుపాటి సత్యమయ్య ఆధ్వర్యంలో హుజూర్ నగర్ మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్ గౌడ్,కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ కోతి సంపత్ రెడ్డి ఎస్ఐ బండి మోహన్ యాదవ్ బాబురావు కవిత ప్రవీణ్ కుమార్ సువల చంద్రశేఖర్ రవి నాయక్ తేజావత్ బెల్లంకొండ అమర్, పిఏసిఎస్ మాజీ చైర్మన్ జక్కుల నరేందర్ యాదవ్ పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు.అనంతరం ఎస్ ఐ, చైర్మన్ కౌన్సిలర్లు బ్యాడ్మింటన్ కోర్టులో ఆటలాడుతూ అలరించారు అనంతరం హుజూర్ నగర్ పట్టణంలోని అన్ని మసీదుల పరిధిలో ఉపవాస దీక్షలో ఉన్న ముస్లిం సోదరులకు, ఇఫ్తార్ విందును ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో చైర్మన్ దొంతగాని శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ 19 వ వార్డు కౌన్సిలర్ వల్లపు దాస్ కృష్ణ ఘనంగా ఇఫ్తార్ విందు ఏర్పాటు చేయడం ముస్లిం సోదరులకు ఉపవాస దీక్ష సమయంలో చాలా ఉపయోగకరంగా ఉందని హిందూ ముస్లింలు ఐక్యంగా ఉండాలని సోదర భావంతో కార్యక్రమాలను ఏర్పాటు చేసుకొని విజయవంతం చేయడం సంతోషంగా ఉందన్నారు హుజూర్ నగర్ లో ఉన్న అన్ని మసీదులను ఈదుగాలను అభివృద్ధి చేస్తామని అన్నారు ఈ కార్యక్రమంలో మైనార్టీ సోదరులు సయ్యద్ రఫీ, జిల్లా వక్ఫ్ బోర్డ్ మాజీ డైరెక్టర్ ఎస్ కె సైదా, సోహెల్ షఫీ బాబా నాగుల్ మీరా మీరా పాషా శాఖమూరి సతీష్ రాపోలు నాగ ప్రవీణ్ వల్లపుదాసు ఎల్లమ్మ వెంకటేశ్వర్లు సుధీర్ తదితరులు మరియు వార్డు ప్రజలు పాల్గొన్నారు



## బెల్లంపల్లి ఏసిపిని కలిసిన సింగరేణి జి.ఎం రాధాకృష్ణ

**మందమర్రి, మహా :** మందమర్రి ఏరియా జిఎం ఎన్ రాధాకృష్ణ మంగళవారం బెల్లంపల్లి ఏసిపి గా కొత్తగా పదవి బాధ్యతలు చేపట్టిన కిరణ్ కుమార్ ను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా సింగరేణి సంస్థ పరిరక్షణకు, శాంతిభద్రతల పరిరక్షణ తమ పోలీసులు సహాయ సహకారాలు అందిస్తామని ఏసిపి హామీ ఇచ్చారు. అంతకుముందు ఏసీపీ కిరణ్ కుమార్ కు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేశారు.

# నీటి ట్యాంకు పనులలో వేగం పెంచాలి

**మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**మంచిర్యాల, మహా :** అమృత్ పథకంలో చేపట్టిన నీటి ట్యాంకు పనులలో వేగం పెంచాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అమృత పథకం క్రింద చేపట్టిన నీటి ట్యాంకుల నిర్మాణ పనులను మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అన్వేష్ తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వేసవిలో ప్రజలకు నిరంతరం త్రాగునీటిని అందించేందుకు చర్యలు వేగవంతంగా తీసుకోవాలని కోరారు. ఈ క్రమంలో అమృత్ పథకంలో భాగంగా చేపట్టిన నీటి ట్యాంకుల నిర్మాణం, పైప్ లైన్ ఏర్పాటు పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన చెప్పారు. అనంతరం నస్పూర్ మండల కేంద్రంలో కొనసాగుతున్న బాల సదనం నిర్మాణ పనులను పరిశీలించి త్వరగా పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పంచాయితీరాజ్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో 1 కోటి 34 లక్షల రూపాయల మిషన్ వాత్సల్య అంచనా నిధులతో బాలసదనం భవన నిర్మాణ పనులు చేపట్టడం జరిగిందని ఈ పనులను కూడా త్వరగా పూర్తిచేసేలా అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని తెలిపారు.

# సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి



**బెల్లంపల్లి ,మహా:** సింగరేణి గని కార్మికుల సమస్యలను పరిష్కారాన్ని పరిష్కరించడానికి యాజమాన్యం కృషి చేయాలని గుర్తింపు కార్మికసంఘం ఏఐటీయూసీ పిలుపుమేరకుమందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయంలో జీఎం చర్చల స్థాయి ప్రతినిధి సివి రమణ,పిట్ కార్యదర్శి సృజన గీతిక ఆధ్వర్యంలో కార్మిక సోదర సోదరీమణులు మంగళవారంనాడు మందమరి ఏరియా జనరల్ మేనేజర్ రాధాకృష్ణ కు వినతిపత్రాన్ని జీ ఎం కార్యాలయంలో సమర్పించారు. "సేవ సింగరేణి"సింగరేణి సంస్థ భవిష్యత్తు మరియు కార్మికుల సమస్యల పరిష్కారానికి పలు డిమాండ్ లతో కూడిన వినతిపత్రాన్ని జనరల్ మేనేజర్ అందజేసి మాట్లాడుతూ వినతి పత్రం లోని అంశాలను వివరించారు.ముఖ్యంగా మెడికల్ బోర్డు పునరుద్దరణ, పెర్క్స్ పై ఇన్కమ్ టాక్స్ రిఫండ్, నియామకాలు చేపట్టిన ఖాళీలు భర్తీ చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో పిట్ కార్యదర్శి సృజన గీతిక, జీఎం చర్చల స్థాయి ప్రతినిధి రమణ రావు, అసిస్టెంట్ పిట్ సెక్రటరీ బొమ్మ శ్రీనివాస్, పిట్ కమిటీ సభ్యులు బింగి సత్యనారాయణ, లక్ష్మణ్, జలది, జ్యోతి, తాజుద్దీన్, సుమలత మరియు జీఎం ఆఫీస్ సిబ్బంది శ్వేత, హిమబిందు, మాధవి, నవీన, స్రవంతి,శిరీష,లావణ్య,స్వాతి, జ్యోతి,తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా పాలన ప్రగతి సమర్ధవంతంగా నిర్వహించాలి

**మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి చంద్రయ్య**



**మంచిర్యాల, మహా :** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజులకు ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి చంద్రయ్య అన్నారు. మంగళవారం కాసిపేట మండలం దేవాపూర్ గ్రామపంచాయతీని సందర్శించి నర్సరీ, పారిశుధ్యం పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని, ప్రతి రోజు ప్రతి ఇంటి నుండి తడి, పొడి చెత్తను వేరువేరుగా సేకరించి డంపింగ్ యార్డ్ కు తరలించాలని సూచించారు.గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల,అంగన్వాడీ కేంద్రాలను సందర్శించి మధ్యాహ్న భోజనం నాణ్యత పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం సకాలంలో పౌష్టిక ఆహారం, శుద్ధమైన త్రాగునీరు అందించాలని అన్నారు. గ్రామంలోని మార్కెట్ ప్రాంతాన్ని సందర్శించి పరిశుభ్రత నిర్వహణపై అధికారులకు పలు సూచనలు చేశారు. గ్రామంలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను సందర్శించి త్వరగా పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఓటరు జాబితా మ్యాపింగ్ ప్రక్రియలో భాగంగా బూత్ స్థాయి అధికారులకు పలు సూచనలు చేసి మ్యాపింగ్ ప్రక్రియ వేగవంతం చేయాలని ఆదేశించారు. గ్రామంలో ఓపెన్ జిమ్ ఏర్పాటు కొరకు స్థలాన్ని పరిశీలించి ఉపాధి హామీ పథకంలో భాగంగా కూలీల హాజరు పట్టికను పరిశీలించారు. ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో మండల తహసిల్దార్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి, ఆర్.ఐ., పంచాయతీ కార్యదర్శి, ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# భగత్ సింగ్, రాజ్గురు, సుఖదేవ్ల స్మారక యువజనోత్సవాలను జయప్రదం చేయండి

**ఎస్ఎఫ్ఐ, చేవెళ్ల డివిజన్ కార్యదర్శి బేగరి అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో పోస్టర్ ఆవిష్కరణ**




**మొయినాబాద్ మహా:** మొయినాబాద్ మున్సిపల్ పరిధిలో ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి చరణ్ గౌడ్ అధ్యక్షతన నిర్వహించిన జరిగింది. విప్లవ వీరులు భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్ 95 వ వర్ధంతి సందర్భంగా నిర్వహించనున్న భగత్ సింగ్ స్మారక యువజనోత్సవాలను జయప్రదం చేయాలని కోరుతూ ఎస్ఎస్ఐ, చేవెళ్ల డివిజన్ కార్యదర్శి బేగరి అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో పోస్టర్ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య సమరంలో యువతకు మార్గదర్శకులుగా నిలిచిన భగత్ సింగ్, రాజగురు, సుఖదేవ్ ల ఆశయాలను నేటి యువత ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని చెప్పారు. సామాజిక న్యాయం, లౌకికత్వం, సమానత్వం కోసం పోరాడిన భగత్ సింగ్ త్యాగం భారత యువతకు స్ఫూర్తిగా నిలుస్తుందని తెలిపారు. దేశంలో పెరుగుతున్న నిరుద్యోగం, విద్యా రంగంపై దాడులు, ప్రజాస్వామ్య హక్కుల పై జరుగుతున్న దాడుల నేపథ్యంలో భగత్సింగ్ ఆలోచనలు నేడు మరింత అవశ్యకంగా మారాయని వారు తెలిపారు. యువత సమాజ మార్పు కోసం చైతన్యవంతంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. సమాజాన్ని పట్టి పీడుస్తున్న గంజాయి, డ్రగ్స్, బెట్టింగ్ యాప్తో యువత ఫెడధోరణులు పడుతున్నారనీ వాటికి వ్యతిరేకంగా విద్యార్థి, యువత నడుం బిగించాలని సూచించారు. రాబోయే రోజుల్లో నిర్వహించనున్న భగత్ సింగ్ స్మారక యువజనోత్సవాలలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా సెమినార్లు, సాంస్కృతిక కార్యక్రమాలు, చర్చా వేదికలు, యువజన వ్యాలీలు, డ్రగ్స్, గంజాయి, బెట్టింగ్ యాప్స్ వ్యతిరేకంగా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ సహాయ కార్యదర్శి చరణ్ గౌడ్, సహాయ కార్యదర్శి మాల చందు, చరణ్, నితీష్, అరుణ్, రోషన్ , విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# కుషాయిగూడలో మందుల శ్యాముల్‌పై ఫిర్యాదు

- హిందూ ధర్మంపై అవమానకర వ్యాఖ్యల ఆరోపణలు బహిరంగ క్షమాపణలు చెప్పాలి
- బిజెపి రాష్ట్ర నాయకురాలు సురేఖ




**కుషాయిగూడ, మహా :** హిందూ ధర్మంపై అవమానకర వ్యాఖ్యలు చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న తుంగతుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే మందుల శ్యామ్యుల్‌పై క్రిమినల్ ఫిర్యాదు నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ కుషాయిగూడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. హిందూ మంత్రాలు, పూజారులపై అవమానకర వ్యాఖ్యలు చేసి మతపరమైన భావాలను కించపరిచారని, బిజెపి రాష్ట్ర నాయకురాలు పులుగు గిరుకబావి సురేఖ ఆరోపించారు తక్షణమే ఎమ్మెల్యే హిందూ సమాజానికి బహిరంగ క్షమాపణ చెప్పాలని సురేఖ డిమాండ్ చేశారు లేకుంటే ఆయనను తెలంగాణలో ఎక్కడ తిరగనివ్వకుండా అడ్డుకుంటామని సురేఖ హెచ్చరించారుఅసభ్యకర వ్యాఖ్యలు దుర్వినియోగ భాషను ఉపయోగించి మత సామరస్యాన్ని దెబ్బ తీశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఘటనపై వెంటనే విచారణ జరిపి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కుషాయిగూడ సిఐ భాస్కర్ రెడ్డి నీ కోరారు పులుగు గిరుకబావి సురేఖ తో పాటు బిజెపి నాయకులు నిత్యానందు హేమంత్ మంజునాథ్ మహేష్ తరుణ్ తదితరులు పాల్గొన్నారు

# ఉప్పల్ భగాయత్‌లోనే ఎంఎంసీ కార్యాలయం

- స్థలాన్ని పరిశీలించిన నియోజకవర్గాల కాంగ్రెస్ ఇన్‌చార్జీలు
- సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపిన నేతలు

**కుషాయిగూడ, మహా:** ఉప్పల్ భగాయత్ ప్రాంతంలోనే మూసీనది ఒడ్డున మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసీ) ప్రధాన కార్యాలయాన్ని నిర్మించనున్నట్లు సంబంధిత అసెంబ్లీ నియోజకవర్గాల కాంగ్రెస్ ఇన్‌చార్జీలు వెల్లడించారు. ఎల్బీనగర్ ఇన్‌చార్జ్ మధు యాష్కీ గౌడ్, మేడ్చల్ ఇన్‌చార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్, ఉప్పల్ ఇన్‌చార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి ఈ విషయాన్ని తెలిపారు. ఉప్పల్ భగాయత్‌లో సుమారు 10 ఎకరాల విస్తీర్ణంలో రూ.98 కోట్ల వ్యయంతో ఆధునిక సౌకర్యాలతో ఎంఎంసీ కార్యాలయాన్ని నిర్మించనున్నట్లు పేర్కొన్నారు. అన్ని వర్గాల ప్రజలకు సులభంగా అందుబాటులో ఉండేలా ఉప్పల్‌లోనే ఈ కార్యాలయాన్ని ఏర్పాటు చేయడానికి నిర్ణయం తీసుకున్నందుకు సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం మధు యాష్కీ గౌడ్, తోటకూర వజ్రేష్ యాదవ్, మందుముల పరమేశ్వర్ రెడ్డి, మాజీ ఫ్లోర్ లీడర్ ధర్పల్లి రాజశేఖర్ రెడ్డి, మాజీ బోడుప్పల్ మేయర్ అజయ్ యాదవ్, మాజీ కార్పొరేటర్లు బొంతు శ్రీదేవి, యాదవ్ పజ్జూరి పవని మణిపాల్ రెడ్డి తదితరులు, డివిజన్ అధ్యక్షులు, నెమలి అనిల్ కుమార్ కాసుల పోచయ్య గౌడ్ కాసుల రవీందర్ గౌడ్ పత్తి కుమార్ రాఘవరెడ్డి కొత్త అంజిరెడ్డి సుంకు శ్రీకాంత్ రెడ్డి సీతారాం రెడ్డి విట్టల్ నాయక్ నీరజ రెడ్డి సింగిరెడ్డి ధనపాల్ రెడ్డి స్వర్ణ రాజ్ కాంగ్రెస్ కార్యకర్తలతో కలిసి భగాయత్‌లో ఎంఎంసీ కార్యాలయం నిర్మాణానికి ఎంపిక చేసిన స్థలాన్ని పరిశీలించారు.

# వైద్య శిబిరాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



**సూర్యాపేట జిల్లా మహా:** 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక' కార్యక్రమంలో భాగంగా మంగళవారం సూర్యాపేట జిల్లా మేళ్లచెరువు మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ మంగళవారం సందర్శించారు.ఈ సందర్భంగా కలెక్టర్ శిబిరంలోని వివిధ విభాగాలను కలియతిరిగి ,రోగులకు అందుతున్న వైద్య సదుపాయాల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని ఈ క్రింది విభాగాలను ఆయన క్షుణ్ణంగా తనిఖీ చేశారు వ్యాధి నిరోధక టీకాల విభాగం టీకాల పంపిణీ తీరును పరిశీలించారు.ల్యాబొరేటరీ రక్త పరీక్షల గదులను సందర్శించి ,పరీక్షల నిర్వహణను పర్యవేక్షించారు. ఆసుపత్రికి సంబంధించిన రిజిస్టర్లు, రికార్డులను తనిఖీ చేసి, విధుల నిర్వహణ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు.

**ప్రజా పాలనను సద్వినియోగం చేసుకోవాలి:**

రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక' కార్యక్రమాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా కలెక్టర్ పిలుపునిచ్చారు. వైద్య నిపుణుల సేవలను గ్రామీణ ప్రజలకు చేరువ చేయడమే ఈ శిబిరాల ముఖ్య ఉద్దేశమని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ మాధవ్ కుమార్, మేళ్లచెరువు మండల వైద్యాధికారి సుధాకర్ నాయక్, ఫార్మసీ ఆఫీసర్ జెట్టి రాజేష్, ల్యాబ్ టెక్నీషియన్ శ్రీనివాస్ రెడ్డి మరియు ఇతర ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# సమీకృత కలెక్టరేట్ ప్రభుత్వ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించిన జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



**సూర్యాపేట జిల్లా మహా:** ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా కలెక్టరేట్ సమావేశ మదిరంలో సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ప్రభుత్వ శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి కార్యాలయ ఆవరణ శుభ్రంగా ఉంచుకోవాలని, ఫైల్స్, ఫర్నిచర్ క్రమ పద్ధతిలో పెట్టుకోవాలని పనికి రాని ఫర్నిచర్ ను డిస్పోజల్ చేసుకోవాలని , అలాగే రన్నింగ్ ఫైల్స్ ను, క్లోజింగ్ ఫైల్స్ ను వేర్వేరుగా పెట్టుకోవాలని,ప్రతి ఫైలును ఈ ఆఫీసులో పంపాలని, ప్రతి కార్యాలయంలో ఇన్ వార్డు ,అవుట్ వార్డు రిజిస్టర్లు,పిఆర్ రిజిస్టర్ లు సక్రమంగా నిర్వహించాలని హాజరు పట్టికలో సంతకం చేసిన తర్వాత సిబ్బంది బయటకు వెళ్ళినప్పుడు కదలికల రిజిస్టర్ లో సంతకం పెట్టి వెళ్లాలని, సిబ్బంది కార్యాలయమునకు హాజరు కాకపోయినాచో తప్పనిసరిగా సెలవు దరఖాస్తు సమర్పించాలని, లేనిచో అధికారి పూర్తి బాధ్యత తీసుకోవాలని,ప్రతి సెక్షన్లో పెండింగ్ పనులు ఉండకూడదని, ఎప్పటికప్పుడు ఫైల్స్ క్లియర్ చేయాలని,ప్రజావాణి దరఖాస్తులను కూడా పెండింగ్ ఉంచకుండా పరిష్కరించాలని ప్రతి కార్యాలయ సిబ్బంది సమయపాలన పాటించాలని విధిగా ఫేస్ అటెండెన్స్ యాప్ లో హాజరు నమోదు చేసుకోవాలన్నారు.ఈ సమీక్షా సమావేశం లో అన్ని కార్యాలయ జిల్లా అధికారులు,కలెక్టరేట్ ఏఓ, సెక్షన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# రామస్వామి గుట్ట వద్ద ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



**హుజూర్ నగర్ మహా:** హుజూర్ నగర్ నియోజకవర్గ కేంద్రంలోని రామస్వామి గుట్టవద్ద నిర్మిస్తున్న 2,160 ఇందిరమ్మ ఇండ్ల మోడల్ హౌసింగ్ కాలనీని త్వరలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు.మంగళవారం రామస్వామి గుట్ట వద్ద నిర్మించిన మోడల్ హౌసింగ్ కాలనీ ని, అంతర్గత రోడ్లు, సభాస్థలిని, మొక్కలు నాటడం, హెలిపాడ్ స్థలాన్ని పరిశీలించి మిగిలిపోయిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా ఉండాలని, అర్హత లేని వారికి ఈ జాబితాలో పేరు ఉండకూడదని స్పష్టం చేశారు.అత్యంత అర్హులైన వారికి ప్రాధాన్యం ఇచ్చి, సూక్ష్మంగా పరిశీలించి ఎటువంటి అవకతవకలకు తావు లేకుండా ఈ ప్రక్రియ చేపడుతున్నట్లు ఆయన చెప్పారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీనివాస్, హౌసింగ్ పీడీ సిద్ధార్థ,జిల్లా ఉద్యానవన అధికారి నాగయ్య, మిషన్ భగీరథ కరుణాకర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, తహసిల్దార్ కవిత, ఇతర జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు




## తలకు తగిలే గాయాల పట్ల అశ్రద్ధ వహించకండి

**న్యూరో సర్జన్.. డాక్టర్ శ్రీనివాస్ బొట్లా**

**రాజేంద్రనగర్ మహా ;** చిన్నపిల్లల తలకు తగులే గాయాల పట్ల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి. పిల్లలు మెట్లమీది నుండి జారిపడిపోతే అశ్రద్ధ చేయవద్దు.మీ నిర్లక్ష్యం వల్ల పిల్లల ప్రాణాలకు ప్రమాదం జరగవచ్చని మలక్ పేట్ యశోద సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ సీనియర్ కన్సల్టెంట్ న్యూరో సర్జన్ డాక్టర్ శ్రీనివాస్ బొట్లా పేర్కొన్నారు.శంషాబాద్ లో మీడియా సమావేశంలో యశోద హాస్పిటల్ ప్రతినిధి శ్రీనివాస్ చిదురా తో కలిసి మాట్లాడారు.శంషాబాద్ వాస్తవ్యుడు మలక్ పేటలోని పాఠశాలలో 12 సంవత్సరాల బాలుడు 5 వ తరగతి చదువుతున్నాడు, పాఠశాల మెట్లు నుండి బాలుడు జారిపడ్డాడు.దీంతో బాలునికి ట్రమాటిస్ బ్రెయిన్ ఇంజురీ జరిగింది. స్థానికంగా ఉన్న ఆసుపత్రికి బాలుని తల్లిదండ్రులు తీసుకెళ్లారు. స్థానిక డాక్టర్ సూచన మేరకు మలక్ పేట్ లోని యశోద ఆసుపత్రికి తరలించారు.వెంటనే స్పందించిన వైద్యులు న్యూరో క్రిటికల్ కేర్ ద్వారా ఎపిడ్యూరల్ హిమరేజ్, తల ఎముక విరుగుడు, ట్రమాటిక్ బ్రేయిన్ ఇంజరీ, మెదడు మీద ఒత్తిడి మధ్య రేఖ మార్పు, ఎడమ ఆర్బిటల్ హిమటోమ అయినట్టుగా గుర్తించారు.బాలుడికి శస్త్ర చికిత్స చేసి బాలుడు ప్రాణాలను కాపాడారు.చిన్న దెబ్బే కదా అని నిర్లక్ష్యం వహిస్తే బాబు ప్రాణాలు కాపాడే వాళ్ళం కాదన్నారు. మీ పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలి. పిల్లలపై అశ్రద్ధ వహించవద్దు. మెట్ల పైనుంచి మీ పిల్లలు జారి పడ్డారు అంటే, వెంటనే డాక్టర్ను సంప్రదించి సరైన చికిత్సను అందించాలని మలక్ పేట్ కన్సల్టెంట్ సర్జన్ న్యూరో సర్జన్ డాక్టర్ శ్రీనివాస్ బొట్లా తెలిపారు.



## ఖానాపూర్ లో ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక

**రంగారెడ్డి జిల్లా మహా:** ఖానాపూర్ అంగన్వాడి కేంద్రం ఏడబ్ల్యుసిలో "ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక" కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. మంగళవారం ఐసిడిఎస్ ఇబ్రహీంపట్నం ప్రాజెక్టు పరిధిలోని ఖానాపూర్ ఏడబ్ల్యుసిలో "ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక"లో భాగంగా, నిర్వహించిన ఈ యొక్క కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సిడిపిఓ వినీతాదేవి మాట్లాడుతూ... సామ్, మామ్ పిల్లలు గ్రోత్ గురించి తెలియచేయుడం జరిగింది. అలాగే హెల్ప్ లైన్ నెంబర్స్ 1098, 100, 112,181 గురించి తెలియజేశారు. ఆడపిల్లలకు బాల్యవివాహాల వల్ల వచ్చే పరిణామాల గురించి ఆమె సూచించారు. అలాగే సిబిఈ, ఈవిఈఎన్డిలో భాగంగా గర్భిణీ మహిళలకు శ్రీమంతం చేయించిన వినీతాదేవి సలహాలు సూచనలు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి సూపర్వైజర్ కల్పన, బిసి శ్రీనివాస్, ఏడబ్ల్యుటి లలిత, గర్భిణీ మహిళలు, బాలింతలు, పిల్లల తల్లిదండ్రులు గ్రామస్తులు పాల్గనడం జరిగింది.

# ఉప్పరిగూడలో యువకుడి మృతదేహం లభ్యం

- మృతి పట్ల అనుమానం వ్యక్తం చేసిన పోలీసులు
- పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తాం సిఐ మహేందర్ రెడ్డి



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో కుళ్ళిన యువకుడి మృతదేహం లభ్యమయింది. రంగారెడ్డి జిల్లా, ఇబ్రహీంపట్నం మండలం, ఉప్పరిగూడ కెఎంఆర్ ఫంక్షన్ హాల్ సమీపంలో ఓ వ్యక్తి మృతి చెంది ఉన్నాడని, స్థానికులచే సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించగా, మంచాల మండలం తాళ్లపల్లి గూడ గ్రామానికి చెందిన దూసరి అర్జున్ అనే వ్యక్తి మృతదేహం లభ్యమైందని పోలీసులు వెల్లడించారు. మృతదేహం కుళ్ళిన స్థితిలో ఉండడంతో సుమారు 5 రోజుల క్రితం అనుమానాస్పద స్థితిలో చనిపోయినట్లు అంచనా వేశారు. మృతుని వద్ద సూసైడ్ నోట్ లభించిందని సిఐ మహేందర్ రెడ్డి తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టడం జరిగిందని, పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తామని ఆయన అన్నారు..

# మైనార్టీలకు అండగా బీఆర్ఎస్ పార్టీ

**ఇఫ్తార్ పార్టీలో బిఆర్ఎస్ నాయకులు కార్తీక్ రెడ్డి**



**రాజేంద్రనగర్ మహా ;** రంజాన్ సందర్భంగా భారత రాష్ట్ర సమితి సీనియర్ నాయకులు కోలన్ ప్రదీప్ రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ ఇందులో, భారత రాష్ట్ర సమితి రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇంచార్జ్ పట్లోళ్ల కార్తీక్ రెడ్డి తో పాటు పలువురు బిఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు. హాజరైన ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. కార్తీక్ రెడ్డి మాట్లాడుతూ మైనార్టీలకు అండగా బిఆర్ఎస్ పార్టీ ఉంటుందన్నారు. మైనార్టీలకు బిఆర్ఎస్ పార్టీ ప్రభుత్వంలో అనేక సంక్షేమ పథకాలు అందాయి. ఇఫ్తార్ విందులు మత సామరస్యానికి ప్రతీకలని, ఇవి సమాజంలో సోదర భావాన్ని పెంపొందించేందుకు దోహదపడతాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మురళీధర్ రెడ్డి, రాష్ట్ర నాయకులు, మంచర్ల శ్రీనివాస్ ,చెక్కల ఎల్లయ్య , దేవరాపల్లి బుచ్చిరెడ్డి, టి గౌస్, కే ,శ్రీనివాస్, రాజేందర్, వీరమళ్ళ హన్మంత్ ముదిరాజ్ ,చరణ్, యుగేందర్ రెడ్డి ,అల్తాఫ్, ముస్లిం మత పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## పట్టుదలతో కృషి చేస్తే అనుకున్న గమ్యం చేరుతారు



**జవహర్ నగర్ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ శివశంకర్**

**కుషాయిగూడ, మహా :** పట్టుదలతో కృషి చేస్తే అనుకున్న గమ్యాన్ని సాధించగలుగుతామని జవహర్ నగర్ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ శివశంకర్ గౌడ్ పేర్కొన్నారు. ఉస్మానియా యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఎన్ఎస్ఎస్ కార్యక్రమంలో భాగంగా ఉస్మానియా ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ప్రొఫెసర్ డాక్టర్ అశోక్ బృందం ఆధ్వర్యంలో కాప్రా సర్కిల్ పరిధిలోని కుషాయిగూడ జై జవాన్ కాలనీ కాప్రా ఈసీఐఎల్ ప్రాంతాల్లో ఎన్ఎస్ఎస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జవహర్ నగర్ ఇన్స్పెక్టర్ శివశంకర్ తో పాటు విశిష్ట అతిథిగా లైవ్ క్లబ్ భాగ్యనగర్ గ్రీన్ సిటీ అధ్యక్షులు కాప్రా ప్రెస్ క్లబ్ అధ్యక్షులు కాప్రా విశ్వకర్మ ట్రస్ట్ చీఫ్ అడ్వైజర్ లయన్ చారి కుషాయిగూడ సబ్ ఇన్స్పెక్టర్ వెంకన్న లు హాజరయ్యారు. ఉస్మానియా ప్రిన్సిపల్ ప్రొ ప్రొఫెసర్ కరుణాసాగర్, వైస్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ రమాదేవి లు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ మాట్లాడుతూ ఓడిపోయామని నిరాశ పడకుండా గెలుపు కోసం కృషి చేయాలి అన్నారు. ట్రాఫిక్ భద్రత గురించి వివరించారు శ్రద్ధ హెల్మెట్ల పై ఉండాలన్నారు. హెల్మెట్ ధరించడం ద్వారా ప్రాణాలు కాపాడుకోగలుగుతామని బ్రతికి ఇంటికి రావడం అనేది నేర్చుకోవాలన్నారు. అరేయ్ లైవ్ అనే కార్యక్రమం విస్తృతంగా చేపడుతున్నామన్నారు. యువత తో సాధ్యం కానిదేమీ లేదు అన్నారు. లయన్ వడ్లోజు జ్యోతిర్మయ చారి మాట్లాడుతూ విలువలతో కూడిన విద్యను మాత్రమే అభ్యసించాలన్నారు. మానవీయత విలువలు కలిగిన విద్యను పొంది భారత దేశ రక్షణకై ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దబడాలన్నారు. విద్య అంటే సర్టిఫికెట్లు మాత్రమే కాదు అని జీవితాన్ని నేర్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ అశోక్, ఉస్మానియా ప్రొఫెసర్ డాక్టర్ నరేష్ , ఏఎస్ఐ గోపాల్ గౌడ్ విశ్వకర్మ ట్రస్ట్ చైర్మన్ కలకొండ బిక్షపతి ,విశ్వకర్మ ట్రస్ట్ స్థలదాత మారోజు నరసింహ చారి ఎన్ఎస్ఎస్ విద్యార్థి బృందం పాల్గొన్నారు.

## మేడ్చల్ కలెక్టరేట్‌లో ఎన్డీఆర్ఎఫ్ మాక్ డ్రిల్

### కెమికల్ బ్లాస్ట్, లీకేజీ ఘటనలపై ప్రత్యక్ష ప్రదర్శన
### విభాగాల సమన్వయానికి ప్రాధాన్యం




**మేడ్చల్, మహా :** ప్రమాద పరిస్థితుల్లో స్పందనను మెరుగుపరచేందుకు మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా కలెక్టరేట్ లో మంగళవారం ఎన్డీఆర్ఎఫ్ ఆధ్వర్యంలో మాక్ డ్రిల్ నిర్వహించారు. పరిశ్రమలు, కర్మాగారాల్లో సంభవించే కెమికల్ బ్లాస్ట్‌లు, గ్యాస్ లీకేజీలు, బాంబు పేలుళ్ల వంటి ఘటనల్లో తీసుకోవాల్సిన చర్యలను ప్రత్యక్షంగా ప్రదర్శించారు. కెమికల్ బ్లాస్ట్ సమయంలో విడుదలయ్యే వాయు కాలుష్యాన్ని అంచనా వేసి, పరిస్థితులకు అనుగుణంగా సహజ వాతావరణాన్ని పునరుద్ధరించే విధానాలను ఎన్డీఆర్ఎఫ్ అధికారి గౌతమ్ కుమార్ వివరించారు. గాయపడిన వారికి అత్యవసర చికిత్స అందించే విధానం, ఫీల్డ్ ఆపరేషన్లలో విభాగాల మధ్య సమన్వయం కీలకమని తెలిపారు. ప్రమాద స్థలాల్లో సిబ్బంది రక్షణ కోసం ప్రత్యేక కిట్లు, మాస్కులు, గ్లౌజులు వినియోగించే విధానాన్ని చూపించారు. బాధితులను రక్షించడమే కాకుండా తమ భద్రతను కాపాడుకోవాల్సిన అవసరాన్ని వివరించారు. క్లోరిన్ రసాయనం వినియోగంతో నిర్వహించిన ఈ మాక్ ఎక్సర్‌సైజ్‌లో జాగ్రత్తలు, నివారణ చర్యలపై అవగాహన కల్పించారు.

## ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి




**భారతీయ జనతా పార్టీ**

**వలిగొండ మహా :** రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులకు ఇస్తామన్న 250 గజాలు ఇంటి స్థలముతో పాటు 25 వేల రూపాయల పెన్షన్ వృద్ధులకు 4000 రూపాయలతో పాటు కళ్యాణ లక్ష్మి రైతు బీమా రైతు భరోసా లాంటివి అనేక హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం నేటి వరకు హామీలను అమలు చేయకపోవడం దుర్మార్గమని వెంటనే హామీలను అమలు చేయాలని స్థానిక తహసిల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు ఈ కార్యక్రమానికి వలిగొండ భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షులు బోళ్ల సుదర్శన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కొప్పుల యాదిరెడ్డి మాట్లాడుతూ హామీలను అమలు చేయకుంటే స్థానిక ఎమ్మెల్యేను అడ్డుకుంటామని ఆయన హెచ్చరించారు ఈ కార్యక్రమంలో నాయకులు బంధారపు లింగస్వామి రాచకొండ కృష్ణ కందుల తానేష్ రామ నర్సు మంద నరసింహ రాస వెంకట్ , బొడిగె ఆనంద్ పాక పుల్లయ్య శ్రీనివాస్ బుంగమట్ల మహేష్ దంతూరి అరుణ్ ఆవుల బిక్షం నారి లింగస్వామి మందుల నాగరాజు రంజిత్ రెడ్డి లింగస్వామి గంగాధర్ దయాకర్ కొత్త రామచంద్ర రమేష్ గోగు మహేష్ కుమార్ సోలిపురం జనార్దన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

## విద్యుత్ కోతలను అరికట్టాలి

- సిపిఎం మండల కార్యదర్శి సిరిపంగి స్వామి
- మండల కమిటీ సభ్యులు గాజుల ఆంజనేయులు



**వలిగొండ మహా:** విద్యుత్ కోతల వల్ల రైతుల మోటార్లు ట్రాన్స్ఫార్మర్లు కాలిపోతున్నాయని విద్యుత్ కోతలు అరికట్టి నిరంతరాయంగా విద్యుత్ను సరఫరా చేయాలని సిపిఎం వలిగొండ మండల కార్యదర్శి సిర్పంగి స్వామి మండల కమిటీ సభ్యులు గాజుల ఆంజనేయులు డిమాండ్ చేశారు మంగళవారం గోపరాజుపల్లి గ్రామంలో ఇంటింటి కార్యక్రమం నిర్వహిస్తూ ప్రజా సమస్యలపై ప్రజల నుండి వస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను చూస్తుంటే ప్రభుత్వంపై ఎంత వ్యతిరేకత ఉందో అర్థమవుతుందన్నారు ప్రభుత్వం ఇచ్చిన హామీలు ఇప్పటివరకు ఒక్కటి కూడా అమలు కాలేదని వృద్ధాప్యపెన్షన్ తులం బంగారం రైతు భరోసా రైతు బీమా లాంటివి నేటి వరకు అమలు కాలేదని వారన్నారు గోపరాజు పల్లి పాల సెంటర్నుండి మూసి వరకు రోడ్డు మంజూరు అయ్యిందని చెప్పి నేటికీ అమలుకు నోచుకోలేదు అన్నారు గోపరాజు పల్లి క్రాస్ రోడ్ నుండి దుప్పల్లి వరకు రోడ్డు అసంతృప్తిగా ఉన్నదని దానిని వెంటనే పూర్తి చేయాలని వారు అన్నారు ఈ కార్యక్రమంలో సిపిఎం గ్రామ శాఖ కార్యదర్శి ఏనుగుల నరసింహ సలిగంజి రాజయ్య గాజుల మల్లయ్య రుద్ర పెల్లి లింగయ్య సలిగంజి నరసింహ రుద్రపల్లి రామలింగంసలిగంజినవీన్ ముత్యాలు తదితరులు పాల్గొన్నారు

## మందుల సామెల్ ఇంటిపై దాడికి నిరసన



- భగ్గుమన్న దళిత బహుజన సంఘాలు
- మనువాద దిష్టిబొమ్మ దగ్ధం

**భువనగిరి మహా :** తుంగతుర్తి దళిత శాసనసభ్యులు మందుల సామెల్ ఇంటిపై బిజెపి మనువాదులు దాడి చేయడాని నిరసిస్తూ భువనగిరిలో మంగళవారం ఎమ్మార్పీఎస్ దళిత బహుజన సంఘాలు ఆధ్వర్యంలో రాస్తారోకో చేసి మనువాద దిష్టిబొమ్మ దగ్ధం చేశారు తుంగతుర్తి ఎమ్మెల్యే దళితుడు అయినందునే అతని ఇంటిపై బిజెపి మనువాదులు దాడి చేయడం దాడి చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని వారు డిమాండ్ చేశారు మనుస్మృతి దేశానికి ప్రమాదకరమన్నారు దళిత ఎమ్మెల్యేల పై దాడులు చేస్తే ఖబర్దార్ అంటూ వారు హెచ్చరించారు ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు దుబ్బ రామకృష్ణ బర్రె జహంగీర్ ఇటుకల దేవేందర్ నాగారం శంకర్ సిల్వర్ రమేష్ బండారు రవి వర్ధన్ కరుణాకర్ నల్ల కృష్ణ శివ తదితరులు పాల్గొన్నారు

## జనాభా గణన 2027 సమర్థవంతంగా నిర్వహించాలి

**అదనపు కలెక్టర్ భాస్కర్ రావు**



**యాదాద్రి భువనగిరి, మహా:** జనాభా గణన 2027 ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించేందుకు అధికారులు, ఛార్జ్ అధికారులు , మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు.మంగళవారం చివరి రోజు జనాభా గణన-సెన్సెస్ 2027కు సంబంధించి చార్జి అధికారుల శిక్షణ ముగింపు కార్యక్రమంలో పాల్గొని రెండు దశల్లో నిర్వహించే గణనను సమగ్రంగా చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. జనాభా గణనను రెండు దశల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. హౌస్ లిస్టింగ్ ను కచ్చితంగా చేసినట్లయితే సెన్సెస్ పూర్తి అయినట్లే అని అన్నారు. బ్లాక్ ల వారీగా ఏర్పాటు చేసుకొని సులభతరంలో సెన్సెస్ చేయాలన్నారు. ప్రతి దశను క్షేత్రస్థాయిలో, పారదర్శకంగా సెన్సెస్ నిర్వహించాలని సంబంధిత అధికారులకు సూచించారు. జనాభా గణన సెన్సెస్ 2027 ప్రక్రియలో పాల్గొనే సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ, సమగ్ర సమాచారం సేకరణపై దృష్టి పెట్టాలని అన్నారు .ప్రభుత్వం చేపడుతున్న ఈ మహత్తర కార్యక్రమం విజయవంతం కావడానికి ప్రతి అధికారి తమ బాధ్యతలను నిబద్ధతతో నిర్వర్తించాలని సూచించారు. డిజిటల్ విధానంలో జరగనున్న ఈ ప్రక్రియలో ప్రతి ఇంటిని, ప్రతి వ్యక్తిని చేర్చడంతో వారి వివరాలను తప్పకుండా నమోదు చేయాలన్నారు. అలాగే, ప్రజల సహకారం కూడా అత్యంత కీలకమని, అవగాహన కార్యక్రమాలు నిర్వహించి జనాభా గణనకు ప్రజలను చురుకుగా భాగస్వాములను చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి, మరియు జిల్లా గణాంక అధికారి వెంకటరమణ,మున్సిపల్ కమిషనర్లు, తాసిల్దార్లు, ఎంపీడీవోలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# విలవిలలాడుతున్న పౌల్ట్రీ సామ్రాజ్యం..

- ఉభయ రాష్ట్రాల్లో 'కొక్కెర' సృష్టిస్తున్న మారణహోమం!
- రోజుకు 8 కోట్ల గుడ్లు.. వందల కోట్ల టర్నోవర్
- నేడు నిలువునా కూలుతున్న ఏపీ, తెలంగాణ కోళ్ల పరిశ్రమ!
- క్షణాల్లో ఖాళీ అవుతున్న వేలాది కోళ్ల ఫారాలు!
- జాతీయ స్థాయి పౌల్ట్రీ రంగాన్ని కబళిస్తున్న రాణికేట్!
- శవాల గుట్టలుగా మారిన వేలాది కోళ్ల ఫారాలు
- ఉభయ రాష్ట్రాల్లో కన్నీరుమున్నీరవుతున్న పౌల్ట్రీ రైతులు!



**హైదరాబాద్, మహా:** అది నిన్నటి వరకు దేశానికే అన్నం పెట్టిన వేల కోట్ల రూపాయల బృహత్తర సామ్రాజ్యం. కానీ నేడు ఆ పౌల్ట్రీ పరిశ్రమ అక్షరాలా శ్మశానాన్ని తలపిస్తోంది. రెక్కల కష్టం దారబోసి, అప్పులు చేసి పెంచుకున్న కోళ్లు కళ్లముందే కుప్పలుతెప్పలుగా ప్రాణాలు వదులుతుంటే ఉభయ తెలుగు రాష్ట్రాల రైతుల గుండెలు పగిలిపోతున్నాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలను 'కొక్కెర' (రాణికేట్) మహమ్మారి ఒక ఊపు ఊపేస్తోంది. ఉమ్మడి మెదక్, ఖమ్మం, ఉభయ గోదావరి, కృష్ణా, చిత్తూరు జిల్లాల్లో ఎటు చూసినా కోళ్ల శవాల గుట్టలే దర్శనమిస్తున్నాయి. పారామిక్సో తరగతికి చెందిన ఈ ఉగ్ర వైరస్ గాలి ద్వారా అత్యంత వేగంగా విస్తరిస్తూ మారణహోమం సృష్టిస్తోంది. వ్యాధి సోకిన గంటల వ్యవధిలోనే కోళ్లు ఆకుపచ్చ విరేచనాలు చేసుకుంటూ, నరాలు పక్షవాతానికి గురై కాళ్లు, మెడ వంకర్లు తిరిగి ప్రాణాలు వదలడం అత్యంత దయనీయంగా మారింది. చనిపోయిన వేలాది కోళ్లను జేసీబీలతో భారీ గుంతలు తీసి సామూహికంగా పూడ్చిపెడుతున్న దృశ్యాలు రెండు రాష్ట్రాల్లోనూ అత్యంత భయానక వాతావరణాన్ని సృష్టిస్తున్నాయి.

### దేశానికే తలమానికం.. రోజూ కోట్ల రూపాయల టర్నోవర్

భారతదేశ పౌల్ట్రీ రంగంలో ఏపీ, తెలంగాణలది తిరుగులేని ఆధిపత్యం. జాతీయ గణాంకాలను పరిశీలిస్తే దేశవ్యాప్తంగా గుడ్ల ఉత్పత్తిలో దాదాపు 18 నుంచి 19 శాతం వాటాతో ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానంలో కొనసాగుతుండగా, సుమారు 13 శాతం వాటాతో తెలంగాణ దేశంలోనే మూడవ స్థానంలో సగర్వంగా నిలుస్తోంది. జాతీయ స్థాయిలో ఉత్పత్తి అవుతున్న పౌల్ట్రీ ఉత్పత్తుల్లో 40 శాతం వాటా కేవలం ఈ రెండు రాష్ట్రాలదే. ఒక్క తెలంగాణలోనే సుమారు రెండు వేలకు పైగా భారీ లేయర్ ఫామ్స్ ఉండగా, వాటిలో 7 కోట్ల కోళ్లు పెరుగుతున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా రోజుకు సుమారు 3.5 కోట్ల గుడ్లు ఉత్పత్తి అవుతున్నాయి. అటు ఆంధ్రప్రదేశ్‌లో రోజూ సగటున 4.2 కోట్ల గుడ్లు ఉత్పత్తి అవుతూ దేశ రికార్డులను తిరగరాస్తోంది. మాంసం ఉత్పత్తిలోనూ ఈ రెండు రాష్ట్రాలు టాప్ 5లో ఉంటూ ఏటా పదుల వేల కోట్ల రూపాయల టర్నోవర్ సాధిస్తున్నాయి. ఒక్క తెలంగాణ పౌల్ట్రీ పరిశ్రమ సగటు రోజువారీ ఆదాయమే 10 కోట్ల రూపాయల పైచిలుకు ఉంటుందంటే ఈ రంగం స్థాయిని అర్థం చేసుకోవచ్చు. లక్షలాది మందికి ఉపాధి కల్పించే ఇంతటి బృహత్తరమైన పరిశ్రమ ఇప్పుడు కొక్కెర కాటుకు బలైపోతోంది.

### రెండు రాష్ట్రాల్లో రోజుకు రూ.15 కోట్ల పైనే నష్టం!

కొక్కెర (రాణికేట్) మహమ్మారి దెబ్బకు రెండు తెలుగు రాష్ట్రాల పౌల్ట్రీ పరిశ్రమ ఎంత దారుణంగా నష్టపోతోందో లెక్కలు వేస్తే ఎవరికైనా కళ్లు బైర్లు కమ్మాల్సిందే. ఒకప్పుడు లాభాల వర్షం కురిపించిన కోళ్ల ఫారాలు నేడు అప్పుల కుంపట్లుగా మారిపోయాయి. తాజా అంచనాలు, మార్కెట్ నిపుణుల విశ్లేషణల ప్రకారం చూస్తే.. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో కలిపి పౌల్ట్రీ పరిశ్రమకు ప్రస్తుతం రోజుకు సగటున 10 నుంచి 15 కోట్ల రూపాయల వరకు కళ్లు చెదిరే నష్టం వాటిల్లుతోంది. వినడానికి ఇది చాలా భయంకరంగా ఉన్నప్పటికీ, క్షేత్రస్థాయిలో రైతులు అనుభవిస్తున్న వాస్తవం ఇదే. ఈ నష్టం కేవలం ఒక్క రూపంలో రావడం లేదు.. పౌల్ట్రీ రైతులను నలుదిక్కులా చుట్టుముట్టి నిలువునా దహించేస్తోంది.

### గుడ్ల ఉత్పత్తిలో భారీ గండి.. రోజుకు కోట్లల్లో ఆదాయం మాయం

నష్టం కేవలం కోళ్ల మరణాలతోనే ఆగిపోలేదు. గుడ్ల ఉత్పత్తి పడిపోవడం రైతులకు కోలుకోలేని దెబ్బ తీస్తోంది. వాస్తవానికి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో కలిపి రోజుకు దాదాపు 8 నుంచి 9 కోట్ల గుడ్లు ఉత్పత్తి అవుతాయి. కానీ ఇప్పుడు వ్యాధి బారిన పడిన కోళ్లు గుడ్లు పెట్టడం మానేయడం, గుడ్లు పెట్టే లేయర్ కోళ్లు లక్షల సంఖ్యలో చనిపోతుండటంతో ఉత్పత్తి భారీగా పడిపోయింది. మార్కెట్లో ఒక్కో గుడ్డు ఉత్పత్తి చేయడానికి రైతుకు 4 రూపాయల పైనే ఖర్చవుతుండగా, ఉత్పత్తి ఆగిపోవడం వల్ల రోజుకు సుమారు 4 నుంచి 5 కోట్ల రూపాయల మేర గుడ్ల వ్యాపారం దెబ్బతింటోంది. దీనికి తోడు ఎగుమతులు కూడా నిలిచిపోవడంతో పౌల్ట్రీ రంగం ఆర్థికంగా కుదేలవుతోంది.

### అమాంతం పెరిగిన దాణా భారం.. రోగం దెబ్బతో కోట్లలో నష్టం

ఒకవైపు కొక్కెర మహమ్మారి సృష్టిస్తున్న విధ్వంసం అయితే, మరోవైపు పెరుగుతున్న నిర్వహణ ఖర్చులు పౌల్ట్రీ రైతుల నడ్డి విరుస్తున్నాయి. పదేళ్ల క్రితంతో పోలిస్తే కోళ్ల దాణా తయారీలో వాడే మొక్కజొన్న, సోయా, తవుడు ధరలు ఏకంగా 300 శాతం పెరిగిపోయాయి. గతంలో కేజీ దాణా 38 రూపాయలు ఉండగా, ఇప్పుడు అది 43 రూపాయలకు చేరుకుంది. ఇంతటి భారీ ఖర్చులు భరించి పెంచుకున్న కోళ్లు చేతికొచ్చే సమయానికి కొక్కెర వ్యాధి బారిన పడి 80 నుంచి 90 శాతం వరకు మృత్యువాత పడుతుండటంతో ఒక్కో ఫామ్‌లో రోజుకు లక్ష నుంచి లక్షన్నర రూపాయల మేర నష్టం వాటిల్లుతోంది. గుడ్డు ఉత్పత్తి మీద కూడా ఒక్కో గుడ్డుకు రూపాయిన్నర వరకు రైతులు నష్టపోవాల్సి వస్తోంది. బ్యాంకులు, ప్రైవేటు వడ్డీ వ్యాపారుల వద్ద అప్పులు తెచ్చి పెట్టుబడి పెట్టిన రైతులు ఇప్పుడు ఆ అప్పులు ఎలా తీర్చాలో తెలియక ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. కోళ్లను పెంచడానికి పెట్టిన దాణా ఖర్చులు, మందుల ఖర్చులు అన్నీ బూడిదలో పోసిన పన్నీరుగా మారిపోయాయి.

### మార్కెట్లో అల్లకల్లోలం.. రైతుకు నష్టం, దళారికి లాభం

లక్షలాది కోళ్లు చనిపోవడం వల్ల మాంసం ఉత్పత్తి ఒక్కసారిగా పడిపోయి, మార్కెట్లో చికెన్‌కు విపరీతమైన కొరత ఏర్పడింది. సాధారణంగా హైదరాబాద్ నగరంలోనే ప్రతి ఆదివారం సుమారు 10 లక్షల కిలోల చికెన్, లైవ్ బర్డ్స్ అమ్ముడవుతాయి. కానీ కొక్కెర వ్యాధి భయంతో సరఫరా చైన్ పూర్తిగా దెబ్బతింది. డిమాండ్ ఎక్కువగా ఉండటంతో కిలో చికెన్ ధర 350 రూపాయలు దాటి రికార్డులు సృష్టిస్తోంది. అయితే ధరలు ఎంత పెరిగినా రైతులకు దక్కే లాభం శూన్యం. బతికున్న కోళ్లన్నీ రోగాల బారిన పడి మట్టిపాలవుతుంటే, ఆ పెరిగిన ధరల వల్ల కేవలం మధ్యవర్తులు, దళారులు మాత్రమే లాభపడుతున్నారు తప్ప రైతులకు ఒరిగేదేమీ లేదు. అటు మధ్యప్రాచ్య దేశాలకు (గల్ఫ్) వెళ్లాల్సిన ఎగుమతులు కూడా ఆగిపోవడంతో గుడ్ల పరిశ్రమ తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయింది. పెట్టుబడి దక్కకపోగా, కళ్లముందే జీవనాధారం నాశనమవుతుంటే అన్నదాతలు దిక్కుతోచని స్థితిలో పడిపోయారు.

### తక్షణమే కదలాల్సిన ప్రభుత్వ యంత్రాంగం

ఈ మహా విపత్తు నుంచి అన్నదాతలను రక్షించాల్సిన బాధ్యత రెండు రాష్ట్రాల ప్రభుత్వాలపై ఎంతైనా ఉంది. దేశానికే అన్నం పెట్టే వ్యవసాయ రంగంలో ఒక కీలకమైన భాగమైన పౌల్ట్రీ పరిశ్రమను కాపాడుకోకపోతే, భవిష్యత్తులో ఈ రెండు రాష్ట్రాల ఆర్థిక వ్యవస్థకే అది కోలుకోలేని దెబ్బ అవుతుంది. పశుసంవర్ధక శాఖ అధికారులు వెంటనే క్షేత్రస్థాయిలో పర్యటించి పరిస్థితి తీవ్రతను అంచనా వేయాలి. వ్యాధి బారిన పడని కోళ్లను రక్షించుకోవడానికి లసోటా వంటి వ్యాక్సిన్లను, అత్యవసర మందులను ఉచితంగా పంపిణీ చేయాలి. దాణా ఖర్చుల భారం తగ్గించడానికి మొక్కజొన్న, సోయాబీన్లపై రైతులకు సబ్సిడీలు అందించాలి. అన్నింటికీ మించి, సర్వస్వం కోల్పోయి రోడ్డున పడిన పౌల్ట్రీ రైతులకు తక్షణమే ఆర్థిక ప్యాకేజీ లేదా నష్టపరిహారం ప్రకటించి ఆదుకోవాలి. లేనిపక్షంలో అప్పుల బాధ తాళలేక పౌల్ట్రీ రైతులు ఆత్మహత్యల బాట పట్టే భయంకరమైన ప్రమాదం పొంచి ఉంది. విపత్తులో చిక్కుకున్న అన్నదాతను ఆదుకోవాల్సిన కనీస బాధ్యత పాలకులదే.

## ఒంటరి యువతే లక్ష్యంగా సైబర్ నేరగాళ్ల వల

- డేటింగ్ యాప్స్ పేరుతో హనీట్రాప్.. వీడియో కాల్ చేస్తే నిలువు దోపిడీయే!
- ఏఐ వీడియోలతో ఆకర్షణ.. మార్ఫింగ్‌తో బ్లాక్‌మెయిలింగ్
- సైబర్ వలలో చిక్కుకున్నారా? భయపడకండి.. వెంటనే 1930కి కాల్ చేయండి
- ఆన్‌లైన్ మోసాలపై వీసీ సజ్జనార్ హెచ్చరిక



**హైదరాబాద్, మహా:** మారుతున్న పరిస్థితుల్లో ఒంటరితనానికి అలవాటు పడిన యువతను లక్ష్యంగా చేసుకుని సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారని, సోషల్ మీడియాలో వచ్చే ఆకర్షణీయమైన ప్రకటనల పట్ల తీవ్ర అప్రమత్తంగా ఉండాలని పోలీసు ఉన్నతాధికారి వీసీ సజ్జనార్ హెచ్చరించారు. "ఒంటరిగా ఉన్నారా? అందమైన అమ్మాయిలతో మాట్లాడండి" అంటూ వచ్చే ప్రకటనల వెనుక ఉన్నది నిజమైన వ్యక్తులు కాదని, అవన్నీ ఏఐ సాంకేతికతతో సృష్టించిన వీడియోలని ఆయన స్పష్టం చేశారు. ఆ మాయమాటలు నమ్మి వారు సూచించిన లింక్స్ ద్వారా ఏవైనా యాప్స్ డౌన్‌లోడ్ చేసుకుంటే, మన ఫోన్‌లోని కాంటాక్ట్స్ మరియు గ్యాలరీ మొత్తం నేరగాళ్ల ఆధీనంలోకి వెళ్లిపోతాయని వివరించారు. ముఖ్యంగా రాత్రిపూట సరదాగా వీడియో కాల్ చేస్తే, అవతలి వైపు అసభ్యకరమైన వీడియోలు ప్లే చేసి, స్క్రీన్‌పై ఉన్న మన ముఖాన్ని రికార్డ్ చేసి మార్ఫింగ్ చేస్తారని ఆయన తెలిపారు. ఆ తర్వాత ఆ వీడియోలను బంధుమిత్రులకు పంపుతామని బెదిరించి సెక్స్‌టార్షన్‌కు (బ్లాక్ మెయిలింగ్) పాల్పడతారని, పరువు పోతుందన్న భయంతో వారు అడిగినంత డబ్బు ఇచ్చుకుంటూ పోతే బ్యాంకు ఖాతాలు ఖాళీ అవ్వడం ఖాయమని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ వంటి సామాజిక మాధ్యమాల్లో ఇలాంటి మోసపూరిత ప్రకటనలు ఇచ్చే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఆన్‌లైన్‌లో ఎవరూ ఊరికే స్నేహితులు అవ్వరని, ఆ ఆకర్షణ వెనుక డబ్బు, పరువును దెబ్బతీసే భారీ కుట్ర దాగి ఉందని గుర్తుంచుకోవాలన్నారు. క్షణికావేశంలో గుర్తు తెలియని డేటింగ్, వీడియో కాలింగ్ యాప్స్ ఇన్‌స్టాల్ చేసుకుని జీవితాలను నాశనం చేసుకోవద్దని యువతకు సూచించారు. ఒకవేళ ఇప్పటికే ఎవరైనా ఈ తరహా సైబర్ వలలో చిక్కుకుని ఉంటే, పరువు పోతుందేమోనని భయపడి మోసపోవద్దని, తక్షణమే 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేయాలని లేదా cybercrime.gov.in వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలని సజ్జనార్ కోరారు.

## ఢిల్లీలో దారుణం

### రీల్స్ పిచ్చికి బలైన యువకుడు



**హైదరాబాద్, మహా.** సోషల్ మీడియాలో వ్యూస్, లైక్స్ కోసం యువత చేస్తున్న ప్రమాదకర స్టంట్లు ప్రాణాల మీదకు తెస్తున్నాయి. తాజాగా తూర్పు ఢిల్లీలోని న్యూ అశోక్ నగర్ (దల్లూపురా) ప్రాంతానికి చెందిన పవన్ (29) అనే యువకుడు ఇన్స్టాగ్రామ్ రీల్ కోసం తుపాకీతో స్టంట్ చేస్తూ ప్రాణాలు కోల్పోయాడు. తన స్నేహితుడికి చెందిన లైసెన్స్‌డ్ పిస్టల్‌ను చేతిలోకి తీసుకున్న పవన్, అందులో బుల్లెట్లు లోడ్ చేసి సరదాగా తన ఛాతీకి గురిపెట్టుకున్నాడు. కేవలం ట్రిగ్గర్ నొక్కినట్లు యాక్ట్ చేసి వీడియో రికార్డ్ చేయాలనుకున్నాడు. కెమెరా వైపు చూస్తూ నవ్వుతూ పోజులిచ్చిన పవన్.. తుపాకీ లాక్ అయి ఉందనే పొరపాటుతో నిజంగానే ట్రిగ్గర్ నొక్కేశాడు. దీంతో ఒక్కసారిగా బుల్లెట్ నేరుగా అతని గుండెల్లోకి దూసుకెళ్లడంతో అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. వీడియో తీస్తున్న స్నేహితుడు వద్దని వారిస్తున్నప్పటికీ కంగారులో జరిగిన ఈ పొరపాటు ప్రాణం తీసింది. తీవ్ర గాయాలపాలైన పవన్‌ను వెంటనే ఆసుపత్రికి తరలించినప్పటికీ, చికిత్స పొందుతూ అతడు మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. ఆ తుపాకీ వీడియో తీస్తున్న పవన్ స్నేహితుడిదేనని, దానికి లైసెన్స్ కూడా ఉందని పోలీసులు గుర్తించారు. ఈ ఘటనపై న్యూ అశోక్ నగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ముమ్మరం చేశారు. సోషల్ మీడియాలో వైరల్ కావాలన్న ఒక చిన్న ఆశ, చివరకు నిండు ప్రాణాన్ని బలిగొంది.






# ఈ స్థాయికి హ్యాపీ: రాశీ ఖన్నా

“చిత్ర పరిశ్రమలో నాకెలాంటి బ్యాక్‌గ్రౌండ్ లేకున్నప్పటికీ ఇండస్ట్రీకి వచ్చాను. నేను ఏ స్థాయి నుంచి వచ్చాను? ఇప్పుడు ఏ స్థాయిలో ఉన్నాను? అన్నది చూసుకుంటే సంతోషంగా ఉంటుంది. దాదాపు 13 ఏళ్ల కెరీర్‌లో ఎన్నో మంచి సినిమాలు, వైవిధ్యమైన పాత్రలు చేశాను. ఇన్నేళ్ల నా కెరీర్ పట్ల చాలా సంతృప్తిగా ఉన్నాను” అని హీరోయిన్ రాశీ ఖన్నా చెప్పారు. పవన్ కల్యాణ్ హీరోగా నటించిన చిత్రం ‘ఉస్తాద్ భగత్ సింగ్’. హరీష్ శంకర్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో రాశీ ఖన్నా, శ్రీలీల హీరోయిన్లు. నవీన్ యెర్నేని, రవిశంకర్ యలమంచిలి నిర్మించిన ఈ మూవీ ఈ నెల 19న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా రాశీ ఖన్నా విలేకరులతో మాట్లాడుతూ– “ఉస్తాద్ భగత్ సింగ్’లో నా పాత్ర పేరు శ్లోక. చాలా మోడ్రన్ అమ్మాయి. మంచి క్యారెక్టరైజేషన్ ఉన్న క్యారెక్టర్ ఇది. ఈ మూవీలో నాకు ఒక మాస్ సాంగ్ ఉంది. నాకు డ్యాన్స్ అంటే ఇష్టం కాబట్టి, ఆ పాట చిత్రీకరణని చాలా ఎంజాయ్ చేశాను. తెలుగువారి పండగైన ఉగాదికి ‘ఉస్తాద్ భగత్ సింగ్’ సినిమా వస్తోంది. ఈ మూవీ చాలా వినోదాత్మకంగా ఉంటుంది. కుటుంబమంతా కలిసి థియేటర్‌లో చూడొచ్చు. ప్రస్తుతం హిందీలో అక్షయ్ కుమార్‌గారితో ఒక సినిమా, అలాగే ‘ఫర్జీ 2’ షో చేస్తున్నాను. అమెజాన్ సిరీస్‌లో ఒక పంజాబీ పోలీస్ క్యారెక్టర్ చేస్తున్నాను. అందులో నా డైలాగ్స్ అన్నీ పంజాబీలోనే ఉంటాయి. తమిళ్‌లో ‘రౌడీ అండ్ కో’ మూవీలో నటిస్తున్నాను. అలాగే తెలుగులో కథలు వింటున్నాను” అని చెప్పారు.

# దురంధర్-2 క్రేజ్.. ఓజీ, బాహుబలి-2 రికార్డ్స్ బ్రేక్..!

రణ్‌వీర్ సింగ్ హీరోగా వచ్చిన స్పై యాక్షన్ థ్రిల్లర్ దురంధర్. పాకిస్తాన్ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కించిన ఈ చిత్రం బాక్సాఫీస్‌ను షేక్ చేసింది. గతేడాది డిసెంబర్ 5న థియేటర్లలో విడుదలైన ఈ సినిమా అత్యధిక వసూళ్లు సాధించిన మూవీగా రికార్డ్ సృష్టించింది. కాంతార2, ఛావా సినిమాలను అధిగమించి మొదటిస్థానంలో నిలిచింది. ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద రూ.1300 కోట్లకు పైగా కలెక్షన్స్ రాబట్టింది. ఈ సినిమాకు సీక్వెల్‌గా దురంధర్2 ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు మేకర్స్. దురంధర్ ది రివెంజ్ పేరుతో ఈ చిత్రాన్ని రిలీజ్ చేస్తున్నారు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ సినిమా మార్చి 19న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో సందడి చేయనుంది.

**అడ్వాన్స్ బుకింగ్స్‌లో దూకుడు..**

ఇప్పటికే అడ్వాన్స్ టికెట్ బుకింగ్స్‌లోనూ దురంధర్2 దూసుకెళ్తోంది. ప్రీమియర్ షోలు, మొదటి రోజు అడ్వాన్స్ బుకింగ్స్‌తో కలిసి ఏకంగా రూ.123 కోట్లు వసూలు చేసింది. రిలీజ్‌కు ముందే సరికొత్త రికార్డులతో అభిమానుల్లో అంచనాలు మరింత పెంచేసింది. మరిన్ని షోల బుకింగ్‌లు ఇంకా ప్రారంభం కావాల్సి ఉన్నందున.. రాబోయే రెండు రోజుల్లో ఈ వసూళ్ల సంఖ్య భారీగా పెరిగే ఛాన్స్ ఉంది. దేశవ్యాప్తంగా మార్చి 18న 'ధురందర్ 2' ప్రీమియర్ షోలు ప్రదర్శించనున్నారు. ఈ ప్రీమియర్ షో టికెట్స్ ద్వారా రూ.38.50 కోట్ల గ్రాస్ వసూళ్లు సాధించింది. ఈ కలెక్షన్స్‌తో ఓజీ, బాహుబలి2 ప్రీమియర్ షోల రికార్డ్స్ బ్రేక్ చేసింది. ఇండియాలో మొదటి రోజు 13 వేల షోల ద్వారా ఈ చిత్రం రూ. 24.50 కోట్ల దేశీయ వసూళ్లు రాబట్టింది. ప్రీ సేల్స్ ద్వారా అంతర్జాతీయ మార్కెట్లలో సుమారు రూ. 60 కోట్లు బిజినెస్ చేసింది. దీంతో ప్రపంచవ్యాప్తంగా మొత్తం ప్రీ బిజినెస్ రూ. 123 కోట్లకు చేరుకుంది.



# ఎవరికైనా అమ్మాయే టార్గెట్..

బిగ్‌బాస్ షోతో ఫేమ్ తెచ్చుకున్న వారిలో రీతూ చౌదరి ఒకరు. గతేడాది బిగ్‌బాస్ సీజన్‌లో మెరిసింది. అయితే ఈ సీజన్‌లో మరో కంటెస్టెంట్ డీమాన్ పవన్‌తో కాస్తా సన్నిహితంగా మెలగడంతో డేటింగ్ రూమర్స్ వినిపించాయి. అయితే వీటిపై ఎవరూ కూడా స్పందించలేదు. తాజాగా రీతూ చౌదరి సోషల్ మీడియాలో చేసిన పోస్ట్ హాట్ టాపిక్‌గా మారింది. అమ్మాయిల జీవితం ఇంతేనంటూ తన లైఫ్‌లో జరిగిన బాధను వ్యక్తం చేసింది. ప్రస్తుతం టీవీ షోలతో బిజీగా ఉన్న రీతూ.. రెండేళ్ల క్రితం శ్రీకాంత్ అనే ఓ వ్యాపారవేత్తతో ప్రేమలో ఉన్నట్లు తెలిపింది. అంతేకాకుండా తామిద్దరం పెళ్లి చేసుకోబోతున్నట్లు అధికారికంగా ప్రకటించింది. ఆ తర్వాత ఏమైందో తెలియదు కానీ వారిద్దరూ విడిపోయారు. ఈ విషయాన్ని గతంలో ఓ ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చింది రీతూ చౌదరి. తాజాగా అమ్మాయిల లైఫ్ గురించి పోస్ట్ చేయడం టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది. రీతూ చౌదరి తన స్టోరీలో రాస్తూ.. "ఈ సమాజం అమ్మాయిలను సులభంగా జడ్జ్ చేస్తారు. ఆమెకు గతంలో ఏం జరిగిందో ఎవరూ అడగరు. తన ప్రేమ, కేరింగ్, నిజాయతీ గురించి ఎవరికీ అక్కర్లేదు. కానీ చివరకు మోసపోయేది ఒక అమ్మాయే. రిలేషన్ షిప్ బ్రేకప్, డిప్రెషన్‌లో ఉన్న తన ఫ్యామిలీ కోసం, కెరీర్ కోసం నవ్వుతూ ఉంటుంది. కానీ సమాజం తన బాధని చూడదు. అందరూ రూమర్స్, ఆరోపణలే చూస్తారు. నిజం ఏంటో తెలియకుండా అమ్మాయి క్యారెక్టర్ డిసైడ్ చేస్తారు. ఒకవేళ తను అమాయకురాలు అయితే ఎందుకు సైలెంట్‌గా ఉంది అంటారు' అని ఆవేదన వ్యక్తం చేసింది. 'ఒక అమ్మాయి హార్ట్ బ్రేకప్ చేసి ఆ అబ్బాయి ముందుకు వెళ్లిపోతాడు. అతను చాలా ఈజీగా మరో అమ్మాయితో వెళ్లిపోతాడు. అన్ని తెలిసినా కూడా సైలెంట్‌గానే ఉంటుంది ఆ అమ్మాయి. కొన్ని సందర్భాల్లో స్నేహం కూడా ఆయుధంగా మారింది. ఒక అమ్మాయి డబ్బు కోసం, చీప్ అటెన్షన్ కోసం మరో అమ్మాయిపై ఆరోపణలు చేస్తుంది. సమాజం ముందు బ్యాడ్ చేసింది. ఒక అమ్మాయి మరో అమ్మాయిని నాశనం చేస్తుందని తెలిసినా కూడా ఆ అమ్మాయి సైలెంట్‌గానే ఉంటుంది. అది తన బలహీనత కాదు..అదంతా తన కర్మ అని.. దేవుడిని నమ్ముతుంది. తన గురించి నిజాలు తెలియని ఈ సమాజం జడ్జ్ చేస్తున్నా కూడా సైలెంట్ ఆ బాధని భరిస్తుంది' అంటూ తన స్టోరీలో రాసుకొచ్చింది. ఇది కాస్తా సోషల్ మీడియాలో వైరల్ కావడంతో.. రీతూ చెప్పింది అంతా తన గురించేనా? అని చర్చించుకుంటున్నారు. అసలు ఆ అబ్బాయి ఎవరు? తనని నెగిటివ్ చేసిన అమ్మాయి ఎవరు? అని కామెంట్స్ చేస్తున్నారు. ఈ స్టోరీ తనదేనా లేదంటే తన ఫ్రెండ్ గురించేనా? అనేది తెలియాలంటే రీతూ క్లారిటీ ఇవ్వాల్సిందే.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020,
PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com